


# విజయభాను

విశాఖపట్నం, బుధవారం 21-06-2023 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 47 సంచిక : 232 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## చదువు కోసం ఎంత ఖర్చుకైనా వెనుకాడం

■ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు ■ 22,710 మంది విద్యార్థులకు ప్రోత్సాహం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



కృష్ణా, (విజయభాను న్యూస్) : మట్టి నుంచి గట్టిగా పెరిగిన ఈ మొక్కలు.. మహావృక్షాలై.. రేపు ప్రపంచానికి ఫలాలు అందించాలని ఆకాంక్షించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రభుత్వం గర్వంగా చెప్పుకోదగ్గ బ్రైట్ మైండ్స్.. షైనింగ్ స్టార్, ఫ్యూచర్ ఆఫ్ ఏపీ మనదని ఉద్ఘాటించారాయన. మంగళవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద టాపర్స్‌ను విజయవాడలో సన్మానించే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నాం. కరిక్యులమ్ కూడా మారింది. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ అందుబాటులోకి వచ్చింది. ప్రతి విద్యార్థికి ట్యాబులు అందిస్తున్నాం. ప్రతీ విద్యార్థికి డిగ్రీ పట్టా ఉండాలనే తాపత్రయంతోనే.. విద్యా దీవెన, విద్యా వసతి చేపట్టాం. విద్యార్థుల ఫీజుల్ని ప్రభుత్వమే భరిస్తోంది. అత్యుత్తమ కంటెంట్‌తో నాణ్యమైన విద్య అందిస్తున్నాం. విద్యార్థులకు టెక్నాలజీ అందించే ప్రయత్నం చేస్తున్నాం. విదేశాల్లో సీటు తెచ్చుకుంటే ఆ విద్యార్థికి అండగా ఉంటాం. చదువు కోసం ఎంత ఖర్చుకైనా వెనకాడం. మీ జగన్ మామ ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని విద్యార్థులను ఉద్దేశించి స్పష్టం చేశారాయన.

జగనన్న ఆణిముత్యాల పేరుతో ఈ నెల 12 నుంచి వారంపాటు సత్కారాలు నిర్వహించనున్నారు. పదవ తరగతిలో ఫస్ట్ ర్యాంకర్‌కు లక్ష. ద్వితీయ ర్యాంక్ రూ.75 వేలు, తృతీయ ర్యాంక్‌కు రూ. 50 వేలు ప్రోత్సాహకం అందించనుంది ఏపీ ప్రభుత్వం. 42 మందిని ఎంపిక చేసి అందిస్తారు.

పదో తరగతి విద్యార్థులకు..

జిల్లా స్థాయి నగదు పురస్కారం: ప్రథమ రూ.50,000, ద్వితీయ రూ.30,000, తృతీయ రూ.15,000, విద్యార్థులు 609 మంది. నియోజకవర్గ స్థాయి నగదు పురస్కారం: ప్రథమ రూ.15,000, ద్వితీయ రూ.10,000, తృతీయ రూ.5,000, విద్యార్థులు 681 మంది. పాఠశాల స్థాయి నగదు పురస్కారం: ప్రథమ రూ.3,000,

తరువాయి 2లో..

## గతంలో కంటే బలంగా అమెరికా, భారత్ సంబంధాలు



న్యూఢిల్లీ : భారత్ – అమెరికా మధ్య సంబంధాలు గతంలో కంటే మరింత బలంగా, దృఢంగా అయ్యాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. నాలుగు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం మొదటి సారి మంగళవారం ప్రధాని అమెరికాకు బయలుదేరారు. ఈ సందర్భంగా అమెరికా మీడియాతో మాట్లాడారు. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న రక్షణ సహకారం తమ భాగస్వామ్యానికి ఓ మూల స్తంభం కానుందని, వాణిజ్యం, సాంకేతికత సహా ఇతరరంగాలకు సహకారం పెరగనుందని అన్నారు. భారతదేశం –అమెరికా మధ్య సంబంధాలు గతంలో కంటే బలోపేతమవడంతో పాటు ఇరు దేశాల అధ్యక్షుల మధ్య అపూర్వమైన విశ్వాసం పెరిగిందని అన్నారు.

భారత్ ఏదేశాన్ని భర్తీ చేయాలని కోరుకోవడం లేదని, ఈ ప్రక్రియతో ప్రపంచంలో భారతదేశం సముచిత స్థానాన్ని పొందాలనుకుంటున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. భారత దేశాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్‌ను సహజ నేతగా చిత్రీకరిస్తుందని, ఆ దేశాల ఆకాంక్షలను వినిపించేందుకు మార్గం కావాలని అన్నారు. బహుళ ధ్రువ ప్రపంచ క్రమంలో వాటిని మరింత విస్తృతంగా ప్రాతినిధ్యం వహించడానికి ఐరాస వంటి ప్రపంచ సంస్థలను సమగ్రంగా మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు సభ్యత్వం కల్పించాలని ఆయన కోరుకున్నారు.

ఈ పర్యటనలో అమెరికాతో సుమారు మూడు బిలియన్ డాలర్ల విలువ కలిగిన సాయుధ డ్రోన్ల కొనుగోలు ఒప్పందంపై ప్రకటన చేయనున్నారు.

అమెరికాలో కాంగ్రెస్ సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని రెండో ప్రసంగం చేయనున్నారు. అలాగే అక్కడి పారిశ్రామిక వేత్తలు, భారతీయ నిపుణులతో భేటీ కానున్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు బైడెన్ వైట్‌హౌస్‌లో ఇచ్చే విందులో పాల్గొననున్నారు.

## రాజ్ భవన్ లో గవర్నర్‌ను కలిసిన టీడీపీ నేతలు



అమరావతి, (విజయభాను న్యూస్) : రాజ్ భవన్ లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ను టీడీపీ నేతలు కలిశారు. ఏపీ లో శాంతిభద్రతల వైఫల్యాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఏపీలో ఆర్టికల్ 355ను అమలు చేయాలని కోరినట్లు టీడీపీ సీనియర్ నేత అచ్చెన్నాయుడు తెలిపారు. "శాంతిభద్రతల నియంత్రణకు అధికారిని నియమించాలని కోరాం. ఏపీలో జరుగుతోన్న హత్యాకాండను గవర్నరుకు వివరించాం. జూన్?లో 15 రోజుల్లో.. 15 సంఘటనలు జరిగాయి. రోజుకో హత్య, దోపిడీ, మానభంగాలు నిత్యకృత్యమయ్యాయి. రేపల్లెలో పదోతరగతి పిల్లాడిని పథకం ప్రకారం చంపేశారు. రేపల్లెలో పదోతరగతి పిల్లాడు హత్యకు గురైతే సీఎం జగన్ వెళ్లరా " అని అచ్చెన్నాయుడు వివరించారు.

## రాష్ట్ర డిజిపి రాజేంద్రనాథ్ తో ఎమ్మెల్సీ వంశీకృష్ణ భేటీ

విశాఖలో జరుగుతున్న పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చ



అమరావతి (విజయభాను న్యూస్) : ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ ఆంధ్రప్రదేశ్ డీజీపీ రాజేంద్ర నాథ్ రెడ్డి ని మంగళగిరి లో మంగళవారం భేటీ అయ్యారు విశాఖ లో ఇటీవల చోటు చేసుకున్న పలు విషయాలను డీజీపీ దృష్టికి తీసుకువెళ్లారు. విశాఖ బ్రాండ్ ఇమేజిని దెబ్బ తీసే విధంగా పలు అంశాలను ముడిపెడుతూ పలువురు రాజకీయ నాయకులు ప్రవర్తిస్తున్నారనీ తెలిపారు. ముఖ్యమంత్రి విశాఖ లో మునిపెన్నడు లేని విధంగా అద్భుతమైన, సుందరమైన నగరంగా విశాఖలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో స్వార్థ ప్రయోజనాల కోసం సంబంధం లేని అంశాలను ప్రభుత్వం పై నెట్టే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.


ప్రశాంతమైన , సుందరమైన విశాఖ నగరంలో దేశ ,విదేశాల ప్రజలు సైతం విశాఖ లో నివస్తున్న విషయాన్ని డీజీపీ కి వివరించారు. రాష్ట్రంలో ఏ మూల ఏమి జరిగినా విశాఖ నగరానికి ముడిపెట్టడం శోచనీయమని అన్నారు. ఈ సందర్భంగా విశాఖ లో పోలీస్ వ్యవస్థ పటిష్టంగా వుందని, తప్పుడు ఆరోపణలు చేస్తూ, స్వప్రయోజనం కొరకు పనిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఒడిశా రైలు ప్రమాదం..

### సీబీఐ దర్యాప్తులో ఊహించని మలుపు

ఒడిశా : ఒడిశా రైలు ప్రమాదం పై సీబీఐ దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. కేసు విచారణలో భాగంగా బాలాసోర్ సిగ్నల్ జేఈ అమీర్ ఖాన్ ఇంటికి సీబీఐ సీల్ వేయడం, అతణ్ని సుదీర్ఘంగా విచారించడం కలకలం రేపుతోంది. ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సిస్టమ్‌లో ఉద్దేశపూర్వకంగా జోక్యం చేసుకోవడం వల్లే ప్రమాదం జరిగిందని రైల్వే అధికారులు తెలపడంతో.. సీబీఐ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తోంది. జేఈ ఇంటికి సీల్ వేయడం సహా దర్యాప్తులో వెలుగుచూస్తున్న విషయాలతో.. బాలాసోర్ రైలు ప్రమాదం వెనక కుట్ర ఉందన్న అనుమానాలు పెరుగుతున్నాయి.

## రాష్ట్రపతి ముర్ముకు సీఎం జగన్ పుట్టిన రోజు శుభాకాంక్షలు



తాడేపల్లి: రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి ముర్ము మంచి ఆరోగ్యం, ఆనందంతో జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. యావత్ జాతికి ద్రౌపదిముర్ము నిజమైన స్ఫూర్తి అంటూ పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం జగన్ ట్వీట్ చేశారు.

## ఐఎఎస్ అధికారులతో ఢిల్లీ పాలనను అడ్డుకుంటున్న కేంద్రం : కేజ్రీవాల్

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం ఐఎఎస్ అధికారులతో ఢిల్లీ పాలనను నియంత్రించాలని భావిస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విమర్శించారు. కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌పై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు ప్రకటించారు. మంగళవారం నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీసెస్ అథారిటీ (ఎన్‌సిసిఎస్ఎ) మొదటి సమావేశానికి హాజరైన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా ఎన్నికైన ప్రభుత్వ అధికారాలను లాక్కుందని అన్నారు. మండిపడ్డారు. మంత్రులకు బదులుగా అధికారులకు బాధ్యతలను కట్టబెట్టిందని, ఆర్డినెన్స్ ఢిల్లీ చీఫ్ సెక్రటరీని కేంద్రం కన్నా ఉన్నత స్థానంలో ఉంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు తీసుకున్న నిర్ణయాలను తోసిపుచ్చే అధికారం ఐఎఎస్‌లకు ఉందని అన్నారు. ఎన్‌సిసిఎస్ఎ సమావేశానికి కొద్ది రోజుల ముందు ఓ అధికారి సస్పెన్షన్‌కు సంబంధించిన ఫైల్ తనకు అందిందని కేజ్రీవాల్ పేర్కొన్నారు. కొన్ని ప్రశ్నలు లేవనెత్తడంతో ఆ ఫైల్ తిరిగి తన దగ్గరకు రాకుండా.. లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయానికి వెళ్లిందని .. ఎన్‌సిసిఎస్ఎకి చెందిన ఇద్దరు సభ్యులు ఆమోదించడంతో ఆ అధికారి సస్పెండ్ అయ్యారని అన్నారు. త్వరలో ఆర్డినెన్స్‌తో పాటు ఈ అంశాలన్నింటినీ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లనున్నామని అన్నారు.



## నిషేధిత ప్లాస్టిక్ కలిగి ఉంటే చర్యలు తప్పవు

### ప్లాస్టిక్ పై స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తాం

### జివియంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ



విశాఖపట్నం, జూన్ 20:- నిషేధిత ప్లాస్టిక్ కలిగి ఉంటే చర్యలు తప్పవని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ మంగళ వారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు ఆధ్వర్యంలో నగరంలో పది ప్రత్యేక బృందాలు ద్వారా నిషేధిత ప్లాస్టిక్ పై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం గత రెండు వారాల నుండి నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రత్యేక బృందాలు ద్వారా మంగళవారం ఒక్కరోజే 35 దుకాణాల నుండి 191.6 కేజీల నిషేధిత ప్లాస్టిక్ తో పాటు రూ.69,800/- అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. గత రెండు వారాల నుండి ఇప్పటివరకు ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా రూ.11,52,600/- వసూల్ చేసామన్నారు. నగర పర్యావరణ పరిరక్షణ దృష్టిలో పెట్టుకొని నిషేధిత ప్లాస్టిక్ ను వినియోగించరాదని, భావితరాల వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అపరాధ రుసుం వసూలు చేయడమే ముఖ్యం కాదని నగర పరిశుభ్రతకే ప్రాధాన్యత ఇస్తున్నామని అందుకు అందరూ తోడ్పాటు అందించాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్ పై అవగాహన కల్పిస్తున్నప్పటికీ పెడచెవిని పెట్టిన వినియోగదారులు, వ్యాపారస్తుల నుండి భారీ స్థాయిలో అపరాధ రుసుముతో పాటు చర్యలు తప్పవని హెచ్చరించారు.

## జూలై1 నుంచి ఓటర్ల వెరిఫికేషన్

### - ఇంటింటికీ వెళ్లనున్న బిఎల్ ఓలు - జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్




శ్రీకాకుళం : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూలై1 నుంచి ఓటర్ల జాబితా వెరిఫికేషన్ నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా వెరిఫికేషన్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూలై1వ తేదీ నుంచి బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల జాబితాను తనిఖీ చేస్తారని తెలిపారు. దీనికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ పరిశీలనలో అధికారులు పక్షపాతంతో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశానికి జాయింట్ ఎం నవీన్, ఇంచార్జ్ డిఆర్ఓ పి. మురళీ కృష్ణ, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, రాజకీయ పార్టీల నుంచి వైసిపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్, టీడీపీ ప్రతినిధి పీఎంజె బాబు, సిపీఎం జిల్లా కార్యదర్శి దుప్పల గోవిందరావు మాత్రమే హాజరయ్యారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 6 గంటలకు ప్రారంభం

### జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం, : జూన్ 21, బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవకార్యక్రమంలో అందరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, శారీరక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి , మానసిక ప్రశాంతత యోగా ద్వారా లభిస్తుందన్నారు. ఈ నెల 21వ తేదీన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 06.00గం.ల నుండి 08.00గం.ల వరకు ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు జరుగనున్నాయని, యోగా శిక్షణ కేంద్రాల వారు కూడా ఇందులో పాల్గొని యోగా వలన కలిగే ఉపయోగాలు గురించి వివరించనున్నరని, ఈ ఏడాది వసుదైక కుటుంబం నినాదంతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా శిక్షణ కేంద్రాల వారు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని ఒక ప్రకటనలో కోరారు.

## 24న జిల్లా పరిషత్ లో సర్వ సభ్య సమావేశం

### ముఖ్యకార్యనిర్వహణాదికారి వెంకట్ రామన్

శ్రీకాకుళం, : జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజాపరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్. వెంకట్ రామన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. జూన్ 24 తేదీన ఉదయం 10.30గం.ల నుండి నిర్వహించనునున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

## చిరుప్రాయంలోనే పురస్కారాలు గర్వకారణం

**- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి - అవోపా ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం**

విజయనగరం : పదో తరగతిలోనే విద్యార్థులు సత్కారం పొందడం గొప్ప ప్రశంసని, వారి తల్లిదండ్రులకు గర్వకారణం అని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డారని, ఇదే స్ఫూర్తిని మున్ముందూ కొనసాగించి ఇష్టమైన రంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో పది, ఇంటర్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన జిల్లాలోని ఆర్యవైశ్య విద్యార్థులకు మంగళవారం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె.. ముందుగా వాసవీమాత చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిభ చూపుతున్న ఆర్యవైశ్య బిడ్డలను గుర్తించి, ప్రోత్సహించిన అవోపాకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రుల కష్టాన్ని మర్చిపోవద్దని సూచించారు. భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగి నలుగురికి ఉపాధి కల్పించేలా, అందరికీ మంచి చేసేలా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఒడి, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్మెంట్ వంటి పథకాల అమలుతోపాటు.. విద్యాకానుకల పేరిట స్కూల్ బుక్స్, స్టడీ మెటీరియల్స్, బ్యాగ్, షఉ అందిస్తూ విద్యార్థులను ప్రోత్సహించడం చాలా గొప్ప విషయమన్నారు. నాడు-నేడు పేరిట పాఠశాలలకు సరికొత్త రూపురేఖలుతో అనేక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. అవోపా గతంలో ఆరోగ్య శిబిరాలు, వధూవరుల పరిచయ వేదికలు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేయడం.. అందరికీ ఆదర్శంగా నిలవడం చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో అతిథులుగా బండారు బంగారాజు,ఎం.వి.వి సత్యనారాయణ, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ రవ్వా శ్రీనివాస్ మాట్లాడారు. అవోపా అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్, కార్యదర్శి తవ్వా మోహనరావు, కోశాధికారి ముమ్మిడిశెట్టి సత్యనారాయణ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# చదువు కోసం ఎంత ఖర్చుకైనా వెనుకాడం

ద్వితీయ రూ.2,000, తృతీయ రూ.1,000, విద్యార్థులు 20,299 మంది.

ఇంటర్ విద్యార్థులకు..

రాష్ట్ర స్థాయి గ్రూపుల వారీగా టాపర్స్‌కు రూ.1,00,000 చొప్పున 26 మంది విద్యార్థులకు ప్రదానం జిల్లా స్థాయిలో గ్రూపుల వారీగా టాపర్స్‌కు రూ.50,000 చొప్పున 391 మంది విద్యార్థులకు ప్రదానం

నియోజకవర్గ స్థాయిలో గ్రూపుల వారీగా టాపర్స్‌కు రూ.15,000 చొప్పున 662 మందికి ప్రదానం

మొత్తం విద్యార్థుల సంఖ్య: 22,710 ర్యాంకర్లకు సమాన మార్కులతో ఎంతమంది ఉన్నా అందరినీ సత్కరించనున్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి నగదుతో పాటు సర్టిఫికేట్, మెడల్ అందజేస్తారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని ఈ కార్యక్రమం. మన విద్యార్థి ఏ రాష్ట్రానికి వెళ్లినా పోటీతత్వంలో నిలబడతారు. విద్యార్థులే రేపటి భవిష్యత్తుగా ఏపీ ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయిల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు 22,710 మంది గత ప్రభుత్వంలో పెత్తందార్ల చేతిలో బందీ అయిన విద్యావ్యవస్థలో ప్రస్తుత ప్రభుత్వం సమూల మార్పులు తెచ్చింది. లక్షల్లో డబ్బు గుంజే కార్పొరేట్ స్కూళ్ల కన్నా మిన్నగా పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించింది. ఇంగ్లిష్ మీడియం తీసుకొచ్చి, డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి, మెరుగైన విద్యనందిస్తోంది. ప్రతి పేద కుటుంబం నుంచి ఒక డాక్టర్, ఒక ఇంజనీర్, ఒక కలెక్టర్, ఒక సైంటిస్ట్, ఒక ఎంటర్‌ప్రెన్యూర్, ఒక లీడర్ వంటి ఆణిముత్యాలు రావాలన్న తపన, తాపత్రయంతో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పనిచేస్తోంది. ఈ నాలుగేళ్లలో కేవలం విద్యా రంగ సంస్కరణలపైనే ప్రభుత్వం అక్షరాలా రూ.60,329 కోట్లు ఖర్చు చేసింది. కాగా, ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యా సంస్థల్లో చదువుతూ.. రాష్ట్ర స్థాయిలో పదో తరగతిలో టాపర్స్‌గా నిలిచిన 42 మంది, ఇంటర్మీడియట్ గ్రూపుల వారీగా టాపర్స్‌గా సత్తా చాటిన 26 మంది విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డులను ప్రదానం చేయనున్నారు. విజయవాడ ఎ-కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం జరిగే వేడుకలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులను సత్కరించనున్నారు. వీరితో పాటు ఉన్నత విద్యలో ఐదు కేటగిరీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులకు 'స్టేట్ ఎక్స్‌లెన్స్ అవార్డులు'ను ప్రదానం చేయనున్నారు. కార్యక్రమ వేదిక ఏర్పాట్లను సోమవారం విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లు పరిశీలించారు.

22,710 మంది విద్యార్థులకు ప్రోత్సాహం

ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్యంలోని వివిధ కేటగిరీ విద్యాసంస్థల్లో చదువుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జగనన్న ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి, ఇంటర్‌లో విద్యార్థులను ఎంపిక చేసింది. పదో తరగతిలో కేటగిరీ వారీగా (జెడ్పీ, మున్సిపల్, మోడల్, ట్రైబల్/ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ తదితర) రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పాఠశాల స్థాయిలో ప్రతి స్థాయిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అవకాశం కల్పించింది.

ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ/ఎంఈసీ, హెచ్ఈసీ(నాలుగు) గ్రూపుల్లో ప్రతి గ్రూపులోను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన మొత్తం 22,710 మంది విద్యార్థులకు ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు'గా ప్రోత్సాహం అందించనుంది. 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో పాఠశాల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో తొలి 3 ర్యాంకులు సాధించిన విద్యార్థులను రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 12 నుంచి 19 వరకు ఇప్పటికే నగదు పురస్కారం, మెడల్, మెరిట్ సర్టిఫికెట్‌తో సత్కరించింది. వీరితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులను, సంబంధిత విద్యాసంస్థలకు మొమెంటోతో పాటు ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపాళ్లను ప్రభుత్వం సన్మానించింది.

## విజయవాడలో భారీ వర్షం.. తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు



విజయవాడ: అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు నైరుతి రుతుపవనాలు కాస్త ఉపశమనం కలిగించే సంకేతాలు అందించాయి. ఈ నెల 11 నుంచి కర్ణాటక-ఏపీ సరిహద్దుల వద్ద నిలిచిపోయిన రుతుపవనాల్లో కదలిక ప్రారంభమైంది. మంగళవారం ఏపీలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించాయి. దీని ప్రభావంతో ఏపీలోని పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వర్షం పడింది. ఇవాళ సాయంత్రం విజయవాడలో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. గత రెండు వారాలుగా నగరంలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఎండ తీవ్రతకి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇవాళ వర్షం కురవడంతో విజయవాడ ప్రజలు సేదతీరారు.

ఏపీలో మోస్తరు నుంచి భారీ వర్షాలు..

నైరుతి రుతుపవనాలు రాయలసీమ, దక్షిణాంధ్రలోని మరికొన్ని ప్రాంతాలకు, నెల్లూరు జిల్లా కావలి వరకు విస్తరించినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డా. బీఆర్ అంబేద్కర్ తెలిపారు. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు, మిగిలినచోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. రేపు పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఇవాళ సాయంత్రం 6 గంటల వరకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో 66.5 మి.మీ, ప్రకాశం జిల్లా కొండెపిలో 64 మి.మీ, ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరులో 58.5 మి.మీ, గుంటూరు జిల్లా కొల్లిపరలో 49.5, మంగళగిరిలో 64 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వివరించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉన్నందున రైతులు, పొలాల్లో పనిచేసే కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తెలంగాణలో రాగల 3 రోజులు వర్షాలు

ఈరోజు నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల రెండు మూడు రోజుల్లో ద్వీపకల్ప దక్షిణ భారతంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని వివరించింది. తెలంగాణలో రాగల 3 రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా ఈరోజు ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్, జనగాం జిల్లాలలో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశం ఉందని సంచాలకులు హెచ్చరించారు.

## జీజీహెచ్‌లో ఫిజియోథెరపీ సేవల పరికరాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా..



కాకినాడ : కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ఫిజియోథెరపీ సేవలను బలోపేతం చేసేందుకు అధునాతన ఫిజియోథెరపీ పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. కృతికాశుక్లా తెలిపారు. మంగళవారం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ఫిజియోథెరపీ బ్లాక్‌లో జెమిని ఎడిబుల్ ఆయిల్ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ. 3.75 లక్షలతో సమకూర్చిన ఫిజియోథెరపీ నూతన పరికరాలను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా.. జీజీహెచ్ వైద్య అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి రోజూ ఆరోగ్య అవసరాల నిమిత్తం వేలాదిమంది ప్రజలు వస్తుంటారని.. ఫిజియోథెరపీ విభాగం ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఈ నూతన ఫిజియోథెరపీ పరికరాలు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు ఈ సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు. ఎముకలు విరిగిన కేసుల్లో చికిత్స చేసిన తర్వాత ఫిజియోథెరపీ సేవలతో పాటు ఫ్రోజెన్ సోల్డర్, సర్వికల్ స్పాండిలోసిస్ తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన ఫిజియోథెరపీ సేవలను ఈ పరికరాలతో అందించవచ్చని వివరించారు. కార్యక్రమంలో సీపీవో పి.త్రినాథ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా డి.హేమలతా దేవి, ఆర్ఎంవోలు డా. అనిత, డా. రాహుల్, సీఎస్ఆర్ ఎంవో డా. పుష్కరరావు, డా. యమున, ఫిజియోథెరపీ, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఐ బైక్ ర్యాలీ

విఆర్.పురం, : పోలవరం నిర్వాసితుల న్యాయ మైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన మండల కేంద్రం రేఖపల్లి నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మండ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ సర్వేల పేరుతో కాలం వెళ్లదీస్తున్న పాలక ప్రభుత్వాలు కళ్ళు తెరిపించాలని ఈ నెల 26న పోలవరంలో జరిగే బహిరంగ సభకు నిర్వాసితులు తరలి రావాలని పిలుపునిచ్చారు. గతంలో లక్షా 15వేల రూపాయలు ఇచ్చిన భూములకు ముఖ్యమంత్రి హామీ మేరకు రూ.5 లక్షలు ఇవ్వాలని, గిరిజనులతో సమానంగా గిరిజననేతరులకు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలని, మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కర్నాటి రాంబాబు, ఏసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఐ ర్యాలీకి సిపిఎం మద్దతు

పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఐ నిర్వహించిన బైక్ ర్యాలీకి చింతూరులో సిపిఎం నాయకత్వం స్వాగతం పలికి సంఘీభావం తెలియజేసింది. 20వ తేదీ నుండి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో జరుగు నిర్వాసితుల మహా పాదయాత్రకు సంఘీభావం తెలియజేయాలని సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఈ ర్యాలీలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, జిల్లా నాయకులు దుర్గాప్రసాద్, బుజ్జా మోహన్‌రావు పాల్గొన్నారు. సంఘీభావం తెలియజేసిన వారిలో సిపిఎం నాయకులు కుంజ సీతారామయ్య, యర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, సీసం సురేష్, పోడియం లక్ష్మణ్, ఎండి సలీం ఉన్నారు.

# యోగా వల్ల ఏకాగ్రత పెరుగుతుంది



గాజువాక (విజయభాను న్యూస్) : యోగా చేయడం వల్ల ఏకాగ్రత పెరిగి, ఒత్తిడి తగ్గి, ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవడుతుందని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 61వార్డ్ మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన యోగా తరగతులను ఆమె ప్రారంభిస్తూ- యోగా ఒక జీవన విధానం అని, దానిని నిరంతరం అభ్యసించాలని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై. అనసూయ దేవి మాట్లాడుతూ- వాలంటీర్లు యోగా ప్రాధాన్యత పై చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం చేయాలని అన్నారు. అనంతరం సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ప్రోగ్రాం అధికారి ఎ.సంధ్యారాణి ఆధ్వర్యంలో యోగా శిక్షణను వలంటీర్లకు ఇచ్చారు. సమావేశంలో ఇతర ప్రోగ్రాం అధికారులు వి. అంజలీదేవి,ఎన్.నదియా, అధ్యాపకులు,పెద్ద సంఖ్యలో వలంటీర్లు పాల్గొన్నారు.

# నూతన విద్యాశాఖ అధికారిణిగా జి.సాయి శైలజ బాధ్యతలు స్వీకరణ



పరవాడ (విజయభాను న్యూస్) : ాతన పరవాడ మండల విద్యాశాఖ అధికారినిగా జి సాయి శైలజ బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎం ఇ ఓ గా బాధ్యతలు స్వీకరించిన జి సాయి శైలజకు విద్యాశాఖ సిబ్బంది ఘన స్వాగతం పలికి పుష్ప గుచ్ఛుము అందజేసి హార్దిక శుభాకాంక్షలు తెలియ పరిచారు... ఈమె నర్సీపట్నం విద్యాశాఖ అధికారినిగా విధులు నిర్వర్తించి సామాజిక బదిలిలో భాగంగా పరవాడ విచ్చేశారు.. ఇప్పటివరకు పరవాడ విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వర్తించిన సునీత గాజువాక ఎంఈఓగా బదిలీ అయ్యారు.

# పీ హెచ్ సి లో పండ్లు రొట్టెలు పంపిణీ



పరవాడ (విజయభాను న్యూస్) : మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి జన్మ దిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పరవాడ పాథమిక ఆరోగ్య కేంద్రములో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో....

తెలుగుదేశం పార్టీ నాయకులు గొర్లి కనకరావు (మాజీ సర్పంచ్), పయిల పైడంనాయుడు (బుజ్జి),పయిల కృష్ణ, వరి చంద్రశేఖర్, గండి మహేష్, ఈర్ల సతీష్, పోతల గోపి, గణపర్తి ఈశ్వర రావు, బండారు రవి, పయిల సత్తిబాబు పయిల రమణ (పాలు), పయిల వెంకటరమణ, గండి అప్పారావు, గెడ్డం సాయి, ధనేష్, రాజు మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కరెంటు ఛార్జీలపై చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం పార్టీ నిరసన



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : సిపిఎం పార్టీ భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో కరెంటు చార్జీలపై చిట్టివలస విద్యుత్ సబ్టేషన్ వద్ద నిరసన తెలియజేయడం జరిగింది! ఈ సందర్భంగా సిపిఎం పార్టీ భీమిలి జోన్ కమిటీ నాయకులు రవ్వ నర్సింగ్ రావు అప్పల నాయుడు మాట్లాడుతూ సామాన్య ప్రజలపై వైయస్సార్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడుసార్లు కరెంట్ చార్జీలు పెంచారని అదనపు భారాలు వేస్తూ గత సంవత్సరం ప్రజలపై భారాలు 14 వేల కోట్ల రూపాయలు వేశారని స్లాబులు మార్చి వేశారని ఇప్పుడు మళ్లీ సర్దుబాటు చార్జీలు పేరట ఆరు వేలకోట్ల రూపాయలు భారం వేశారని ఏప్రిల్ మే నెలలో వాడిన కరెంటుకు 80 పైసలు అదనంగా యూనిటీ వేశారని సంవత్సరాలు తరబడి బకాయిలు ఉన్న విద్యుత్ ప్రజలు చెల్లించారని...

వాటిపై అదనపు చార్జీలు ఇప్పుడు వసూలు చేయడం దుర్మార్గ మని గృహ వినియోగదారులకు వ్యవసాయ పంపు సెట్లుకు స్మార్ట్ మీటర్ల పెట్టడానికి సిద్ధపడుతున్నారని ఇది ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రజలపై అదనపు బారాలని ఇప్పటికే ప్రజలు రైతులు సరైన ఆదాయం లేక కష్టాల్లో ఉన్నారని ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడితే మరింత అగాధంలోకి వెళతారని విద్యుత్ చార్జీలు సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని వారు కోరారు.

# విశాఖ ఉత్తరాంధ్ర రీజినల్ కోఅర్డి నేటర్ వైవీ సుబ్బారెడ్డికి 35వ వార్డు సమస్యలపై వినతిపత్రం సమర్పించిన విల్లూరి భాస్కరరావు



అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : విశాఖ ఉత్తరాంధ్ర రిజినల్ కోఅర్డి నేటర్ వైవీ సుబ్బా రెడ్డి కీ సర్కుట్ హౌసు లో కలిసి 35వ వార్డు పరిధిలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలు అలాగే 35వ వార్డు అభివృద్ధికి సంబంధించి వైవీ సుబ్బా రెడ్డి కి వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ వినతి పత్రంలో ఆయిల్ మిల్లు రోడ్డుమరియు కాలువలు ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని గాజులు వీధిలో అంగన్వాడీ కేంద్రం నూతనంగా ఏర్పాటు చేయాలని అలాగే పూర్ణ మార్కెట్ మెయిన్ రోడ్డు నుంచి రామకృష్ణ జంక్షన్ వరకు రోడ్డు కు ఇరువైపులా సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాలని అలాగే పూర్ణ మార్కెట్ అరటి పళ్ళు సందు రోడ్డు అసంపూర్తిగా సిసి రోడ్ వేయడం జరిగింది ఆ మిగిలిన రోడ్డును కూడా పునర్నిర్మాణం చేపట్టాలని పూర్తిగా సిసి రోడ్డు వేయాలని వేలంపేట స్టేడియం తూర్పు గేటు ఆపోజిట్లో సిసి రోడ్ వేయాలని ప్రసాద్ గార్డెన్స్ పండ వీధి చిన్న దుర్గాలమ్మ గుడి జంక్షన్ లో ఖాళీగా ఉన్న ప్లేస్ లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని వేలంపేట లక్ష్మీనగర్ మురికివాడ ప్రాంతాన్ని పక్క గృహాలు నిర్మించాలని పలు సమస్యలపై అభివృద్ధి పై వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 35 వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు సచివాలయం కన్వీనర్లు పాల్గొనడం జరిగినది.

# డిగ్రీ 3వ సెమిస్టర్ లో శ్రీ కృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : ఆంధ్రా యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మూడవ సెమిస్టరు ఫలితాలలో తగరపువలస శ్రీ కృష్ణా డిగ్రీ విద్యార్థులు ప్రతిభను కనభరిచారనీ కళాశాల కరస్పాండెంట్ బి.నర్సింగరావు తెలిపారు.భీమిలి, తగరపు వలస, ఆనందపురం, భోగాపురం మండలాల్లో ఉన్న కళాశాలల ఫలితాలు కన్నా అత్యధిక మార్కులు సాధించినట్లు చెప్పారు. వీరిలో ఆళ్ళ హరిత కు పది పాయంట్లు కు గాను 9.52,ఎం. లోహిత 9.32,ఉషారాణి 9.30, కుసుమ 9.26, గాయత్రీ 9.22, మౌనిక 9.11, రోహిణి 9.04, వర్షిణి, శైలజ 9, కె. దేవి 8.38 పాయంట్లు తో ఉత్తీర్ణత సాధించారనీ అన్నారు.

కళాశాల 95 శాతం ఉత్తీర్ణత సాదించారనీ తెలిపారు. పై విధార్థులును కాలేజీ కరెస్పాండంట్ బి. నర్సింగరావు అభినందించారు.

ఈ కార్యక్రమములో ప్రిన్సిపాల్ జె. సతీష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె. చిట్టిరెడ్డి, ఐ. రాజేష్ కుమార్ , అద్యాపకులు పాల్గొన్నారు.

# అప్పన్న హుండీ లెక్కింపు... 2 కోట్ల 23 లక్షల 32 వేల భారీ ఆదాయం



సింహాచలం (విజయభాను న్యూస్) : శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళ వారం ఆలయకార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు.

భక్తులు32 రోజులకు నగదు: రూ.2,23.32,228/

రోజుకు రూ.6,97,882 /- లక్షలు చొప్పున హుండీ ఆదాయం వచ్చినది.

కానుకల రూపములో

- బంగారం: 206గ్రాములు,
- వెండి: 16 కేజీల 732గ్రాములు

భక్తులు హుండీ ద్వారా సమర్పించుకున్నారు.

అనుబంధ దేవాలయం పైడితల్లి అమ్మవారి హుండీ రూ:8.08.740/-

ఈరోజు హుండీ లెక్కింపు నకు ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస రాజు ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి నరసింహరాజు దేవాదాయ శాఖ అధికారులు ఇన్స్పెక్టర్ వసంత్ కుమార్ మరియు శ్రీ భూసమేత వెంకటేశ్వర స్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారి పి ఎస్ ఎన్ మూర్తి ఎన్పిఎఫ్ సిబ్బంది హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

మరియు ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి రమణమూర్తి పర్య వేక్షకులు పాలూరి నర్సింగరావు దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు హుండీ లెక్కింపు కార్యక్రమం లో పాల్గొన్నారు.

# ఓక్రిడ్జ్ విద్యార్థులు స్విట్జర్లాండ్ లో సాహసయాత్ర

భీమునిపట్నం : విజయభాను న్యూస్ : తమ పాఠశాల విద్యార్థులు స్విట్జర్లాండ్ లోస్విస్ ఆల్ఫైన్ గ్రామం నుంచి గ్లేసియర్ 3000 వరకు అన్వేషణ సాగించినట్లు విశాఖ ఓక్రిడ్జ్ పాఠశాల ప్రిన్సిపాల్ శైలా భమిడిపాటి అన్నారు. శిక్షణ పొందిన నార్త్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ గ్రేడ్ ల ఆధ్వర్యంలో 8 రోజుల పాటు ఈ సాహసయాత్ర జరిగిందనీ చెప్పారు.ఈ యాత్ర లో 11 మంది విద్యార్థులు పాల్గొని అక్కడ అత్యధిక హిమనదీయ పరిసరాలపై వాతావరణ మార్పుల ప్రభావంను అన్వేషించడమే కాకుండా,నావిగేషన్,క్యాంపు క్రాఫ్ట్,వంట ఆల్ఫైన్ భూభాగంలో మనుగడ కోసం అవసరమైన ఇతర కీలకపద్దతులలో అవగాహన పొందినట్లు చెప్పారు. అంతేకాకుండా రెండు రోజుల ప్రయాణం లో లెస్ మార్టినెట్స్ నుంచి పర్వత చాలెట్ వరకు ట్రెక్ చేసారనీ అన్నారు.ఈ యాత్ర విద్యార్థులుకు స్విట్జర్లాండ్ యొక్క సాంస్కృతిక,వంటల ఆనందం ను అన్వేషించడానికి అవకాశాలు అందించినట్లు చెప్పారు.ఈయాత్ర విద్యార్థులుకు మరచిపోలేని సాహసం అనీ యాత్ర విద్యార్థి అన్నారు.మేము మన గురించి మన చుట్టూ ఉన్న ప్రపంచం గురించి చాలా నేర్చుకున్నామనీ ఇది గొప్ప అనుభవమనీ చెప్పారు.స్కూల్ డైరెక్టర్ అమిత్ జైన్ మాట్లాడుతూ స్విస్ ఆల్ప్స్ లోని నార్త్ ఆంగ్లియా ఎక్స్ ఫెడిషన్ పర్వతాల మాయా జలాన్ని సవాల్ చేసే సురక్షితమైన వాతావరణం లో కనుగొనే అసమానమైన అవకాశంను మా విద్యార్థులుకు అందిస్తుందనీ తెలిపారు. ఓ క్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ భవిష్యత్ నార్త్ ఆంగ్లియాఎడ్యుకేషన్ యాత్రల కోసం ఎదురు చూస్తుందని అన్నారు.

# అలరించిన సంగీత నృత్య సౌరభం

## మంత్రముగ్ధుల్ని చేసిన కూచిపూడి నృత్య మరియు సంగీత నీరాజనం



విశాఖపట్నం, విజయభాను న్యూస్ : నృత్య సంగీత కళారూపాలు కనువిందు చేశాయి. ఒకదానివెంట మరొకటి ప్రేక్షకులను పరవశింప జేశాయి. నగరానికి చెందిన నాట్యపరిమళ మ్యూజిక్ & డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం నగరంలో వేంచేసియున అల్లూరి సీతరామరాజు విజ్ఞన ప్రాంగణంలో గాన నృత్య నీరాజనం మరియు కర్నాటక సంగీత నైపుణ్య శిక్షణా తరగతులలో మెళుకువలు తెలుసుకొని, నేర్చుకొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ముఖ్య అతిధిగా విచ్చేసిన కేంద్ర సంగీత నాటక ఆకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ కూచిపూడి నాట్య గురువు శ్రీమతి ఎ.బి బాలా కొండలరావు విద్యార్థి, విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఈ వేగవంతమైన కాలంలో మన భారతీయ కళలు పిల్లలకు నేర్పించడం, వారి మానసిక స్థైర్యాన్ని మానసిక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది. నాట్యపరిమళ మ్యూజిక్ & డాన్స్ అకాడమీ పిల్లలను ఎంతోబాగా అటు సంగీతంలోనూ, ఇటు నాట్యంలోనే సాధన చేయించి ఈ గాన నృత్య నీరాజనంలో మంచి ప్రతిభను కనబరిచేలా చేసిన అకాడమీ డైరెక్టర్ లిపికా రెడ్డిని అభినందించారు. సభాధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భారతీయ సాంప్రదాయాలను అనుసరిస్తూ సంస్కార వంతులుగా ఎదగా లన్నారు. నైపుణ్య శిక్షణ తరగతులకు నృత్య విభాగం పరీక్ష అధికారిణిగా వ్యవహారించిన పి.శశిలత కృష్ణ మరియు సంగీత విభాగం పరీక్ష అధికారిగా వ్యవహరించిన డా॥వై. బాల గణేష్‌ను అభినందించారు. అంతర్జాతీయ కూచిపూడి నృత్య కళాకారిణి అకాడమీ డైరెక్టర్ లిపికా రెడ్డి నృత్య నిర్దేశకత్వంలో వినాయక కౌతం, కృష్ణం కలయశకం, ఎందరో మహానుబావులు మరియు దశవతార శబ్ధం పలు అంశాలను ప్రదర్శించిన చార్మిత, భవాని, సాయి రోషిణి, ఇంద్రప్రియ, గగన స్ఫూర్తి, పర్ణిక, చాందిని, శివపార్వతి, భవగ్న, మానసశ్రీ, భవ్యశ్రీ, భవగ్న, కావ్య లలిత భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. మరియు గాయకులు లావణ్య, శరణ్య, సంఘవి రెడ్డి, షణ్ముఖ, సిందుజారెడ్డి, అనుష, సుదీక్ష, శ్రీఅనగా ఆలపించిన శక్తి సహిత గణపతము, రామదాసు కీర్తన పలుకే బంగారమాయే, ఘరుడ గమణ తవ, పలుమారు ఉట్ల పండుగను తదితర భక్తి రసవంతమైన గీతాలను పాడి శ్రోతల ప్రశంశలందుకున్నారు. ఈ కార్యక్రమంలో

మాజీ పబ్లిక్ ప్రొషిక్యూటర్ & ప్రముఖ న్యాయ వాది ఎస్.ఎస్.ఎన్.రాజు మరియు ఆకాడమి వ్యవస్థాపకులు కంబాపు సత్యనారాయణ రెడ్డితదితరులు పాల్గొన్నారు.



# భీమిలి లో శ్రీ జగన్నాథ స్వామి రధాయాత్ర

భీమునిపట్నం : విజయభాను న్యూస్ స్థానిక శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో మంగళవారం వార్షిక తొలిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామ సుభద్ర సహిత శ్రీ జగన్నాథ స్వామికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీ జగన్నాథ స్వామి వారి తొలి రధాయాత్ర భీమిలి పురవీధుల్లో నిర్వహించారు. ఈ రధాయాత్ర లో వంశపారంపర్య అర్చ కులు రొంపిచర్ల సింగరాచార్యులు ప్రసాద్ ,కృష్ణ ,భక్తులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## వాన!

'చూపుల కన్నా ఎదురుచూపులే తీయనా' అంటాడో కవి. ప్రాచీన సాహిత్యంలో ఎదురుచూపునకు ప్రతీక చాతక పక్షులు. వాన చినుకులను మాత్రమే తాగే చాతక పక్షులు...వాన కోసం, ఆకాశం నిండా ముసురుకొనే నల్లని మబ్బుల కోసం ఎదురుచూస్తుంటాయి. వెన్నెలను మాత్రమే భుజించే చాతకాలు పండువెన్నెల కోసం నిరీక్షిస్తుంటాయి. ప్రేయసీ ప్రియులు ఒకరికోసం ఒకరు, ఒకరి మాటకోసం మరొకరు రోజుల తరబడి ఎదురుచూస్తూనే వుంటారు. రైతు ఎదురుచూస్తుంటాడు ఋతు పవనాల కోసం... కారుమబ్బుల కోసం...ముత్యాల హారాల్లా జారిపడే వాన చినుకుల కోసం. ఎప్పుడెప్పుడు తన పొలంలోని బురదమట్టిలో కాలుమోపి పులకించి పోదామా...తొలకరి చినుకులలో తడిసి ముద్దవుదామా అని. 'ఒకవేళ ఎదురుచూపులు నెరవేరకపోతే ఆశ్చర్యపోవద్దు... జీవితమంటే అంతే' అంటారు బ్రిటిష్ మానసిక విశ్లేషకురాలు అనా ఫ్రాయిడ్. జీవితంలో ఎదురుచూపులు తప్పనిసరి. ప్రేయసీ ప్రియుల ఎదురుచూపులో ఒక భావుకత వుంటుంది. చాతక పక్షుల ఎదురుచూపులో ఒక మాధుర్యం... నిరీక్షణ వుంటుంది. కానీ, వాన కోసం ఎదురుచూసే రైతు కళ్ల నిండా ఆశ వుంటుంది. ఆ ఆశ వెనుక కన్నీటి వరదగుడి దాగివుంటుంది. ఋతుపవనాలనగానే రైతుల కళ్లలో కోటి ఆశలు మొలకెత్తుతాయి. త్వరగా ఋతుపవనాలు వచ్చి, వర్షాలు పడితే దుక్కిదున్ని, విత్తనాలు సిద్ధం చేసుకొని, నారుమళ్లు పోసుకొని పంటలకు సిద్ధపడదామా అనే ఆతృత వుంటుంది.ఋతుపవనాలు వస్తున్నాయనగానే ప్రజల మనసుల్లో కాసింత ఉపశమనం కనిపిస్తుంది. మృగశిరలో ముంగిళ్లు చల్లబడతాయనే ఆశ చిగురిస్తుంది. వేసవి ఎండల నుంచి ఊరట లభిస్తుందన్న ఉత్సాహమూ కనిపిస్తుంది. వాస్తవానికి మృగశిర కార్తెలో వచ్చే నైరుతీ ఋతుపవనాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. ఈ కార్తెను రైతులు ఏరువాక సాగేకాలం అంటారు. 'పడమట దిక్కున వరద గుడేసె/ ఉరుముల మెరుపుల వానలు గురిసె/ వాగులు వంకలు ఉరవడి జేసె/ ఎండిన బీళ్లూ ఇగుళ్ళు వేసె/ ఏరువాక సాగారో రన్నో చిన్నన్న/ నీ కష్ట మంత తీరునురో రన్నో చిన్నన్న' అంటూ... కోటి ఆశలతో వ్యవసాయానికి సన్నద్ధమౌతాడు రైతు. వర్షాకాలం వచ్చి పది రోజులైంది. మేఘాలు ఉరమటం లేదు. ఆకాశం మెరవటం లేదు. వానలు తరమటం లేదు. ప్రకృతిలో మార్పు కనిపించడంలేదు. 'మృగశిర కార్తెతో మొదలై ఉత్తర కార్తె కొచ్చేసరికి శిఖరం మీంచి దూకే జలపాతంలా రేగిపోవాల్సిన పచ్చదనం ఏదో జబ్బు చేసిన పిల్లాడిలా నీరసంగా పడివుంది' అంటాడు 'మబ్బులు వాలని నేల' నవలా రచయిత. ఒక్కోసారి ఈ కార్తెలో పెద్ద వానలొచ్చి చెరువు కట్టలు తెగిపోయిన ఏడాదులున్నాయి. ప్రస్తుతం ఎక్కడా చినుకు జాడ లేదు. మరోవైపు రోజురోజుకీ ఎండలు మండిపోతున్నాయి. వర్షాలు ఎప్పుడు పడతాయా...అని కళ్ల నిండా ఆశలు నింపుకొని ఎదురు చూస్తున్నారు రైతులు. ఇదిగో ఋతుపవనాలు, అదిగో ఋతు పవనాలు అంటూ గత పది రోజులుగా ఎదురు చూస్తున్న రైతుల కళ్లలోని నీరు ఆవిరవుతున్నా... నింగి నుంచి చుక్క రాలడం లేదు. ఈ నెల 11న రాష్ట్రంలోకి ప్రవేశించిన ఋతుపవనాలు శ్రీహరికోట నుంచి ముందుకు కదలడంలేదు. దీంతో రాష్ట్రంలో తీవ్ర వడగాడ్పులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పుడు వ్యవసాయం జూదంలా మారింది. ఈ నేలలో ప్రకృతికీ రైతుకు మధ్య సమతౌల్యం దెబ్బతిన్నది. ఋతువులు గతి తప్పు తున్నాయి. గ్రీష్మతాపానికి గొంతెండి, నెర్రలిచ్చిన భూమి...వాన చినుకు కోసం బేలగా చూస్తున్నది. సినారె చెప్పినట్లు 'బీట వారిన చేల పీయూషములు దేల సాగుమా ఓ నీలిమేఘుమా' అంటూ ప్రేమగీతాలు ఆలపిస్తున్నది. 'గగన మదనాలింగ నోత్సాహియై బిగువు నిట్టూర్పు బాహువుల సెగలెగయగా' అంటూ స్వాగత వచనాలు పలుకుతున్నది. ఋతుపవనాల రాకతో వర్షం జూన్ మొదటి వారంలో మొదలై... జులై మొదటి వారానికి దేశమంతా వ్యాపిస్తుంది. ఈ సమయంలో వచ్చే వర్షం వ్యవసాయానికి చాలా కీలకం. 'కడవల ఉదకంబు ముంచి తెచ్చి వంచిన గతి' అని మొల్లమాంబ చెప్పినట్లు వర్షాలు పడ్డాయంటే... 'కమ్మని మట్టి వాసనల కానుక లిచ్చెద స్వీకరింపుమా' అన్నట్లుగా భూమి పరిమళాలు వెదజల్లుతుంది. రైతుల కళ్లలో వెలుగులు నిండుతాయి. రైతు ఆనందం ప్రపంచానికిక పండుగే పండుగ!

# 57 ఏండ్లలో గుడి, బడిని పట్టించుకోలే.. సాగునీటి గోస తీర్చలే.. మంత్రి కేటీఆర్ ధ్వజం



రాజన్న సిరిసిల్ల : ఎవడో వచ్చి నాలుగు స్పీచ్‌లు కొట్టంగానే, ఊదరగొట్టే ఉపన్యాసాలు ఇవ్వగానే ఆగమాగం మాటలు మాట్లాడగానే మనం కూడా ఆగం కావొద్దు.. ఈ రాష్ట్రం ఎవరి వల్ల బాగు పడుతుందో ఆలోచించాలి అని రాష్ట్ర మంత్రి కేటీఆర్ సూచించారు. 57 ఏండ్లలో గుడిని, బడిని పట్టించుకోలేదు.. సాగునీటి గోస తీర్చలేదు కానీ.. ఇప్పుడు వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారని ప్రతిపక్షాలపై కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎల్లారెడ్డిపేటలో రూ. 8.5 కోట్లతో అభివృద్ధి చేసిన విద్యా క్యాంపస్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. మనం ఖర్చు చేసే ప్రతి పైసాను సమగ్రంగా ఆలోచించి ఖర్చు పెట్టాలి అని కేటీఆర్ సూచించారు. ప్రజలకు అవసరమైన వాటిని తప్పకుండా చేయాలి. మా కంటే ముందున్న ప్రభుత్వాలు ఏం చేశాయి..? ఒక బడిని బాగు చేద్దామన్న ఆలోచన లేదు.. కానీ ఇప్పుడొచ్చి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. బడిని, గుడిని పట్టించుకోలేదు. కరెంట్, సాగు నీళ్లు ఇవ్వలేదు. ఎవడో చెప్పిండని కాదు.. మన ప్రణాళిక ప్రకారం పని చేయాలి. అయిన పనుల గురించి మాట్లాడటం లేదు. ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్‌కు అర పైసానైనా సాయం చేసిండా.. ఒక్క నవోదయ పాఠశాలనైనా వచ్చిందా..? కస్తూర్బా కాలేజీ వచ్చిందా..? మెడికల్ కాలేజీ రాదు.. నర్సింగ్ కాలేజీ ఇవ్వరు. మళ్లీ సిగ్గు లేకుండా డిగ్రీ కాలేజీ ఇవ్వాలని మాట్లాడుతారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**బరాబర్ ఎల్లారెడ్డిపేటకు డిగ్రీ కాలేజీ వస్తది**

బరాబర్ ఎల్లారెడ్డిపేటకు డిగ్రీ కాలేజీ వస్తది అని కేటీఆర్ తేల్చిచెప్పారు. కానీ నువ్వేవడో ఆందోళన చేసినందుకు కాదు. ఎల్లారెడ్డిపేట ప్రజల మీద ప్రేమతోని కేసీఆర్ డిగ్రీ కాలేజీ ఇస్తారు. కార్లకు అడ్డపడటం, ధర్నాలు చేయడం కాదు.. చేతనైతే, దమ్ముంటే.. కేంద్రం నుంచి ఓ రెండు కాలేజీలు, ఓ రెండు పరిశ్రమలు తీసుకురావాలి. సిరిసిల్ల నేతన్నల కోసం ఒక మెగా పవర్‌లూమ్ క్లస్టర్ తీసుకురావాలి. కరీంనగర్‌లో ఒక ట్రిపుల్ ఐటీ తీసుకురా..? అలా విద్యలో పోటీ పడాలని బీజేపీ నేతలకు కేటీఆర్ సవాల్ విసిరారు.

**పలకతో వచ్చి.. పట్టాతో వెళ్లాలి..**

పలకతో వచ్చి పట్టాతో వెళ్లాలనే ఉద్దేశంతో గంభీరావుపేటలో కేజీ టు పీజీ క్యాంపస్ ఏర్పాటు చేశాం అని కేటీఆర్ గుర్తు చేశారు. 3 దశల్లో 510 ప్రభుత్వ పాఠశాలల్లో 12 మౌలిక సదుపాయాల, వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల పరిధిలో - 60 పాఠశాలల్లో 22 వేల మంది విద్యార్థులకు కంప్యూటర్ చాంప్స్ పేరుతో బేసిక్ కంప్యూటర్ పరిజ్ఞానం అందిస్తున్నాం అని తెలిపారు. రాష్ట్రంలోని 26 వేల ప్రభుత్వ పాఠశాలలను టీ ఫైబర్‌తో అనుసంధానం చేయనున్నామని చెప్పారు.

**అనేక అంశాల్లో సిరిసిల్ల నంబర్ వన్**

సిరిసిల్ల ఇప్పటికే అనేక అంశాల్లో దేశంలోనే ముందుంది అని కేటీఆర్ తెలిపారు. దేశంలో విద్య విషయంలో బెస్ట్ స్కూల్ ఎక్కడా ఉన్నాయంటే సిరిసిల్ల అనే పేరు రావాలన్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మానవ సంబంధాలు, జీవ కారుణ్యంపై అవగాహన పెంపొందించాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇస్తామన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదులో మండలాలు, ప్రజా ప్రతినిధులు పోటీ పడాలి. రాజన్న సిరిసిల్ల జిల్లాను విద్యా ప్రమాణాలలో దేశంలోనే ఆదర్శంగా నిలపాలని కేటీఆర్ సూచించారు.

# విజృంభిస్తున్న విషజ్వరాలు..

## ఒక్కరోజే 13 వేల మంది ఆసుపత్రిలో చేరిక



కేరళ : కేరళ రాష్ట్రంలో విషజ్వరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత 10 రోజులుగా రోగులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో రోజుకు 10 వేల మందికి పైగా ప్రజలు జ్వరాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. సోమవారం ఒక్కరోజే 13 వేల మంది జ్వరంతో ఆసుపత్రిలో చేరారు. జూన్ నెల ప్రారంభం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా అంటు జ్వరాల వ్యాప్తి పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల ప్రారంభం నుంచి సోమవారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,61,346 మంది చికిత్స పొందినట్లు తెలిపారు. కాగా, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి సంఖ్య కంటే.. ప్రభుత్వ ఆసుపత్రులకు క్యూ కడుతున్న వారి సంఖ్యే రెట్టింపుగా ఉంది.

వైరల్ ఫీవర్స్ తోపాటు డెంగీ మెదడు వాపు కేసులు కూడా భారీగా పెరుగుతున్నాయి. దీంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం ఒక్కరోజే 110 మంది డెంగీ బారిన పడినట్లు తేలింది. మరో 218 మందికి డెంగీ లక్షణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అత్యధికంగా డెంగీ రోగులు ఎర్నాకులం జిల్లాకు చెందిన వారే ఉన్నారు. ఆ జిల్లాకు చెందిన 43 మందికి డెంగీ నిర్ధారణ కాగా, మరో 55 మందిలో ఈ లక్షణాలు కనిపించాయి. ఈ నెల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 1,011 మంది డెంగీ బారిన పడ్డారు. మరోవైపు మెదడువాపు వ్యాధి బారిన పడే రోగుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. సోమవారం ఒక్కరోజే ఎనిమిది మందికి మెదడు వాపుగా తేలింది. మరో 14 మందికి ఈ లక్షణాలు కనిపించాయి. ఈనెలలో ఇప్పటి వరకూ 76 మందికి మెదడు వాపు వ్యాధి సోకగా.. మరో 116 మందిలో లక్షణాలు కనిపించాయి. ప్రస్తుతం వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా విష జ్వరాలు విజృంభిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులను సిద్ధం చేసింది. రోగాలు ఇతరులకు వ్యాపించకుండా పటిష్ఠ చర్యలు చేపట్టింది. అవసరమైన మందులు నిల్వ ఉండేలా చూసుకోవాలని ఆసుపత్రులను ఆదేశించింది. ప్రతి ఆసుపత్రిలోనూ సిబ్బందితోపాటు వైద్యులు అందుబాటులో ఉండాలని తెలిపింది.

## సమకవి సమయం

### 'చైతన్య స్వరూపిణి'

సరస్వతీ వైభవం అనంతం
స్మరణ చేతనే మోక్ష సిద్ధి
శుద్ధ ధవళ కాంతులకు ప్రతీక
శ్వేత హంస వాహిని, సత్యగుణ ప్రదాత
సకల విద్యలు, బుద్ధికి అధిష్ఠాత్రి
ఆది పరాశక్తి, సకల జీవులకు జనని
అన్న, ధన ప్రదాయిని, ఆత్మజ్యోతి
జ్ఞానం, విద్య, వాక్కుల స్వరూపం
మేధ, ఆలోచన, ధారణ
స్మృతి, షజ్ఞ, ప్రతిభల కలయిక
భక్తి, భుక్తి మోక్ష ప్రదాయిని శారద

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

# పంచాంగం

మాసం : ఆషాడ; తిథి : తదియ రా.12.51; పుష్యమి రా.11.41; వ.ఉ.6.03ల 7.48 — బుధవారం 21-06 -2023

a **మేషం** : మీ సంతానం విద్య, వివాహ విషయాల పట్ల శ్రద్ధ కనబరు స్తారు. ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల సహకారంతో ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిలు వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. వృత్తులు వారికి సామాన్యం. b **వృషభం** : నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. మీ శ్రీమతి వైఖరి అగ్రహం కలిగిస్తుంది. మీ సోదరుల తీరు మీకెంతో మనస్తాపం కలిగిస్తుంది. ఆకస్మికంగా ప్రయాణం చేయవలసి వస్తుంది. ఆత్మీయులకు, చిన్నారులకు విలువైన కానుకలందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు. C **మిథునం** : చిట్స్, ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. కొంతమంది మీ వ్యాఖ్యలను అపార్థం చేసుకుంటారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు. స్త్రీలు అభిప్రాయాలకు ఆమోదం లభించదు. నిరుద్యోగులకు బోనస్ ప్రకటనల పట్ల అప్రమత్తత చాలా అవ సరం. d **కర్కాటకం** : విద్యార్థులు ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బందు లెదుర్కోవలసి వస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అన్ని విధాలా యోగదాయకమైన కాలం. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం. e **సింహం** : ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. కుటుంబీకుల మధ్య ఆసక్తిరకమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి. f **కన్య** : భాగస్వామిక చర్చల్లో కొత్త విష యాలు చోటు చేసుకుంటాయి. స్త్రీలతో సంభాషించేటపుడు ఓర్పు, సంయమనం పాటించండి. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం. ఏదైనా స్థిరాస్తి అమ్మకం చేయాలనే మీ ఆలోచన మరి కొంత కాలం వాయిదా వేయడం మంచిది. g **తుల** : మీ కావలసిన వస్తువులు లేక పత్రాలు కనిపించకుండా పోయే ఆస్కారం ఉంది. స్త్రీలకు ఆరోగ్యంలో చికాకులు తప్పవు మెళకువ వహిం చండి. మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. ఐరన్, సిమెంటు, కలప, ఇనుము, ఇసుక, ఇటుక వ్యాపారస్తులకు లాభదాయకం. h **వృశ్చికం** : నిరుద్యోగులకు బోగస్ ప్రకటనల పట్ల అప్రమత్తత అవసరం. సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఒక ప్రకటన మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. క్రీడల పట్ల ఆసక్తి పెరుగును. మీ శ్రమకుతగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, తోటివారి సహకారం లభిస్తుంది. i **ధనుస్సు** : మీరంటే అందరికీ గౌరవం ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం ఆర్థిస్తారు. బంగారం, వెండి, లోహ రంగాలలో వారికి మందకొడిగా వుండగలదు. j **మకరం** : దేవాలయ, విద్యాసంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ప్రముఖులకు కానుకలు, శుభాకాంక్షలందించి వారిని ప్రసన్నం చేసుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. విద్యార్థులకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపునపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం.మీ సంతానం మొండి వైఖరి మిమ్ములను చికాకు పరు స్తుంది. దూరపు బంధువుల ఆరోగ్య విషయంలో ఆందోళన చెందుతారు. k **కుంభం** : ఆర్థిక పరిస్థితి ప్రోత్సహకరంగా ఉంటుంది. షేర్ వ్యాపారస్తులకు ప్రోత్సాహం కానవచ్చును. పదవీ స్వీకారాలకు, వృత్తివ్యాపారాల్లో కొత్త వ్యూహాలు అమలుకు అనుకూలమైన రోజు. వ్యవసాయ, ఎగుమతి, దిగుమతులు లాభిస్తాయి. ఒక కార్యం నిమిత్తం దూర ప్రయాణం చేయ వలసి వస్తుంది. పాత రుణాలు తీరుస్తారు. L **మీనం** : పాత మిత్రుల కలయిక సంతృప్తి నిస్తుంది. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొం టారు. మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమ కూర్చుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలను అధికమిస్తారు. స్త్రీలకు ఆరో గ్యంలో మెళకువ అవసరం. నిరుద్యోగులకు అశాజనకం.



# శబరిమల పదునెట్టాంబడి

## సంకీర్తన

జన్మలన్నింటిలో మానవజన్మను మించింది లేదం టారు. చేసిన తప్పొప్పులకు ప్రాయశ్చిత్తం చేసు కోవాలంటే పద్దెనిమిది సోపానాలను స్పర్శిం చాలి. అప్పుడే సమస్త పాపాలూ హరించబడతాయి. ఆ సోపానాలే పదునెట్టాంబడి. 18 మంది ఆధి దేవతలు 18 సోపానాలుగా, పదునెట్టాంబడి పేరుతో 18 మెట్లుగా మారిన అద్భుతం శబరిమ లలో మనకు సాక్షాత్కరిస్తుంది.

అయ్యప్ప మాల ధరిం చిన స్వాములు తమ దీక్షకు పరమార్థం సిద్ధించేది పదునెట్టాంబడిని అధిరోహిం చినప్పుడు మాత్రమే నని నమ్ముతారు. అప్పుడే స్వామివారి దర్శనం, పాపహరణం సాధ్యమవు తుందన్నది వారి విశ్వాసం.

అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న భక్తులు అత్యంత నియమ నిష్ఠలతో శబరిమల చేరుకుంటారు. స్వామివారి సన్నిధానానికి చేరుకోవాలంటే వీళ్లు పదునెట్టాంబడి పేరుతో పిలువబడే 18 మెట్లను ఎక్కవలసి వుంటుంది.

ఈ 18 సోపానాలు అత్యంత పవిత్రమై నవిగా, శక్తి మంతమైనవిగా వారు భావి స్తారు. నలభై అడుగుల ఎత్తయిన పీఠాన్ని అయ్యప్ప స్వామి అధిరోహించడం కోసం 18 మంది అధి దేవతలు 18 సోపానాలుగా మారారని పురాణాలు చెబు తున్నాయి. ఆ 18 మంది దేవతలు ఛండిక, అన్నపూర్ణ, భద్రకాళి, భైరవి, సుబ్ర హ్మణ్యేశ్వర, గంధర్వ, కార్తవీర్య, తృషనా భాయ, శృతి బేధక, కటు శబ్దక, యుడుంబు, భేతాళ, హరిప్రియ, కర్ణ పిశాచి, పుళిందిని, రేణుక, ప్రదీపిక, ప్రత్యంగిరాలుగా పిలుస్తారు.

మాలధారణ చేయని వారికి ఈ మెట్ల మీదుగా ప్రవేశం వుండదు. మండల దీక్ష తీసుకుని ఇరుముడి కలిగిన భక్తులకు మాత్రమే ఈ సోపానాల మీదుగా స్వామి సన్నిధానానికి రావాలన్నది నియమం.

18మెట్లలోఒక్కోమెట్టుకు ఒక్కో విశిష్టత ఉంటుంది. ఈ మెట్లు గ్రానైట్‌తో నిర్మించినా 1985లో పంచలోహాలతో తాపడం చేశారు. వీటిని పరశురాముడు నిర్మించాడని చెప్తారు.

అష్టదిక్పాలకులు ఎనిమిది మంది(ఇంద్రుడు, అగ్ని, యముడు, నైరుతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశాన్యుడు), రెండు యోగములు (కర్మ యోగం, జ్ఞానయోగం), తరువాతవి విద్య, ఆవిద్య, జ్ఞానం, అజ్ఞానికి రూపాలుగా కూడా ఈ మెట్లను చెప్తారు.

ఈ ఆలయంలో స్వామి కొలువైన సందర్భంగా మృదంగ, భేరి, కాహళ, దుందుభి, తుంబురు, మర్దల, వీణ, వేణు, నూపుర, మట్టుక, డిండిమ, ఢమరుక, ఢంక, దవళ, శంఖ, పటహ, జఝరి, జంత్‌ర అనే 18 వాయిద్యాలను మ్రోగించారట. ఈ మెట్లను పూజించడాన్నే పడిపూజ అని అంటారు. అయ్యప్ప స్వామి పుట్టుక: ముక్కోటి హిందూ దేవతలలో అయ్యప్ప స్వామి ఒకరు. ఈయనను హరిహర సుతుడని, ధర్మశాస్త, మణికంఠుడని కూడా పిలుస్తారు. శివుడు, విష్ణువుల సంగమం వల్ల పుట్టాడు, కనుక ఈ పేరు వచ్చిందని తెలుస్తోంది.

అయ్య= విష్ణువు, అప్ప = శివుడు అని అర్థం. క్షీరసాగర మధనం అనంతరం విష్ణువు మోహినిగా అవతరించి దేవతలకు, రాక్షసులకు అమృతం పంచడానికి పూనుకుంటాడు.

ఈ క్రమంలోనే అదే రూపంలో విహరిస్తున్న మోహిని పట్ల శివుడు ఆకర్షితుడవుతాడు. అలా శివకేశవుల తేజస్సుతోనే అయ్యప్ప జన్మించాడన్నది పురాణ కథనం. మహిషి అనే రాక్షసిని సంహరించడం కోసం అయ్యప్పకు వీరిద్దరికీ జన్మించాడన్నది ఆయన పుట్టుకలో ఉన్న రహస్యం. ఆ రాక్షసిని చంపి అయ్యప్ప శబరిమలైలో వెలిశాడంటారు. దీక్షా, నియమాలు: భక్తులు కార్తీకమాసం నుండి దాదాపు మార్గశిర, పుష్య మాసాల వరకూ కఠినమైన నియమాలను ఆచరిస్తారు. ఐహికమైన సౌఖ్యాలను త్యజించడం,

*సశేషం...*

# వైభవంగా జగన్నాధ స్వామి రథయాత్ర



గాజువాక (విజయభాను న్యూస్) : పెదగంట్యాడ హెచ్.బి కోలనీ జగన్నాధ స్వామి ఆలయం ప్రధాన అర్చకులు ప్రమోద్ సారంగి ఆద్వర్యంలో మంగళవారం జగన్నాధ స్వామి రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. ముఖ్య అతిదిగా గాజువాక మాజీ శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, బీజేపి కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కార్పొరేటర్ గంధం శ్రీను తదితరులు కొబ్బరికాయ కొట్టి తాడు లాగి రథయాత్రలో పాల్గొన్నారు. జగన్నాధ స్వామి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని కోరారు. లోకకళ్యాణార్థం, భక్తుల దర్శనార్థం ప్రతి ఏటా ఇక్కడ అన్ని వీదుల్లో స్వామివారిని ఊరేగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిలకర్ర రమణ, భువనేశ్వరి, ఒడిస్సా నుండి స్థానిక హెచ్ బి కోలనీలో వుంటున్న భక్తులు బారీగా పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు బ్రేక్ ఫెయిల్... తప్పిన పెను ప్రమాదం






ములగాడ (విజయభాను న్యూస్) : మల్కాపురం పోలీస్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం....మంగళవారం గాజువాక మీదగా సిందియా వెళ్తున్న 55 బస్సు( ఏపీ 31టి ఇ 5175) బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ని ఢీ కొని ఫూట్ పాత్ పైకి దూసుకుపోయింది. అప్రమత్తంగా వ్యవహరించిన బస్సు డ్రైవర్ షిప్ యార్డ్ గోడ వైపు బస్సును మళ్ళించారు. బస్సులో ప్రయాణికులు ఎవరు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం పై ఉన్న నేవీ ఉద్యోగి ఇది గమనించి పక్కకు తప్పుకోగా తన వాహనాన్ని ఆర్ టి సి బస్ ఢీకొనడంతో వాహనం నుజ్జు నుజ్జు అయ్యింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ని క్లియర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# తక్షణమే ముద్రగడ పద్మనాభం కాపులకు క్షమాపణలు చెప్పాలి..

## కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు గుర్రాల శ్రీనివాస్ డిమాండ్..



అక్కయ్యపాలెం (విజయభాను న్యూస్) : కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం తీరు పట్ల కాపు సంక్షేమ శాఖ విశాఖ జిల్లా అధ్యక్షులు, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జ్ గుర్రాల శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ను విమర్శించే స్థాయి ముద్రగడకు లేదన్నారు. నగరంలోని రాయల్ విల్లా హొటల్లో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ కాపు ఉద్యమ నేతగా కాపుల సంక్షేమానికి ముద్రగడ సాధించింది శూన్యమని విమర్శించారు. కాపులను అడ్డం పెట్టుకొని రాజకీయంగా ఎదిగి, మంత్రి పదవిని చేజిక్కించు కున్న ఘనత ముద్రగడని తూర్పారబెట్టారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రౌడీలా మాట్లాడుతున్నా రంటూ ముద్రగడ పేర్కొనడానికి తప్పుబట్టారు. వైసీపీ నేతలు, మంత్రులు పవన్ కళ్యాణ్ ను తీవ్ర అసభ్య పదజాలంతో విమర్శిస్తే ముద్రగడ నోరు ఎందుకు లేవలేదని ప్రశ్నించారు. అధికార పక్షానికి తొత్తులా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని సందేహం వ్యక్తం చేశారు. తన ఉనికిని చాటుకునేందుకు ముద్రగడ పవన్ కళ్యాణ్ ని పై విమర్శలకు గుప్పించారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలకు ముద్రగడ పద్మనాభం స్వస్తి పలకని పక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవని గుర్రాల శ్రీనివాస్ గట్టిగా హెచ్చరించారు. ఇప్పటికైనా ముద్రగడ పద్మనాభం హొందా వ్యవహరించాలని సూచించారు. రాబోయే రోజుల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ తోనే సామాజిక వర్గానికి ప్రత్యేక గుర్తింపు అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్తుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో విశాఖపట్నం కాపు సంక్షేమ శాఖ జిల్లా ఉపాధ్యక్షుడు బడా రమేష్, రాష్ట్ర మహిళ అధ్యక్షరాలు కరణం కళా వతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ తుమ్మల త్రానాధ్ రావు, మీసాల నాగేశ్వరరావు, ఆకుల రాజు,దామోదర, పోతూ వెంకట ప్రసాద్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# యోగ డే సందర్భంగా బైక్ ర్యాలీ



భీమునిపట్నం, విజయభాను న్యూస్ బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం భారత స్వాభీమాన్ ట్రస్ట్ , పతంజలి యోగాసమితి ఆధ్వర్యంలో. విశాఖ పురవీధుల్లో జెండాలు పట్టుకొని, యోగా చేయండి ఆరోగ్యంగా ఉండండి అంటూ నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించినట్లు విశాఖ భారత స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు టి.ఎస్.వి.ప్రసాదరావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సభ్యులు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, కార్యాలయాల్లో ,ప్రైవేట్ సెక్టార్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో, వార్డులలో, పార్కుల్లో ,తమ దగ్గర ట్రైనింగ్ పొందిన ట్రైనీ టీచర్స్ తో 9 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రోటోకాల్ ను నిర్వహిస్తామని అన్నారు.

మాజీ అధ్యక్షులు సాయి నాగేశ్వరరావు మాట్లాడుతూ యోగాను ఈ ఒక్క రోజే కాకుండా ప్రతిరోజు కూడా యోగా చేసి అనారోగ్యాల బారిన పడకుండా బీపీ, షుగర్ లేకుండా ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగ సమితి జిల్లా కార్యవర్గం, పతంజలి డివిజన్ యోగా కార్యకర్తలు నాగేశ్వరరావు, సోమేశ్వరరావు, ప్రభాకర్, సత్యనారాయణ, ప్రభాకర్ మూర్తి, బాలరాజ్ ,రవికుమార్, శైలజ, లత తదితరులు పాల్గొన్నారు.

# 28న కురుపాంకు సీఎం జగన్



కురుపాం, విజయభాను న్యూస్ : కురుపాంలో ఈ నెల 28న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమ్మఒడి సాయం విడుదల చేయనున్నట్లు సమా చారం. ఈ నేపథ్యంలో సభ, ఏర్పాట్లను కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పరిశీలించారు. పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్డీవో హేమలత, డీఎస్పీ జి.వి.కృష్ణారావు, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్ఐ ప్రసాద్, తహసీల్దారు రమేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. ఉదయం పార్వతీపురంలో జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 29 వరకు అధికారులెవరూ సెలవుపై వెళ్లకూడదని ఆదేశించారు.

# శ్రీ పైడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న గంటా



విశాఖపట్నం, విజయభాను న్యూస్ : మాజీ మంత్రి విశాఖ ఉత్తర నియోజకవర్గ శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు మంగళ వారం విశాఖ ఉత్తర నియోజకవర్గం 54వ వార్డు కంచరపాలెంలో గల శ్రీ పైడిమాంబ అమ్మవారి గ్రామ దేవత పండుగ మహొత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం అమ్మవారి తీర్థప్రసాదములు భక్తులకు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజక వర్గ ఇన్ ఛార్జ్ చిక్కాల విజయ బాబు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కార్తీక్ కుట్టా, రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, సనపల వరప్రసాద్, కొయిలాడ వెంకటేశ్, బొడ్డుపల్లి లలిత గొంప ధర్మారావు శేఖర్, వాసు, మాధవరావు, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ ర్యాలీ నిర్వహణకు పక్కా ఏర్పాట్లు



విజయనగరం, విజయభాను న్యూస్ : రాష్ట్రస్థాయిలో జిల్లాలో జులై 20 నుంచి ఆగస్టు 2 వరకు జరగనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధిత అధికారులంతా సిద్ధం కావాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్‌లో కర్నల్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారు లతో ఆమె సమావేశమయ్యారు. రోజుకు కనీసం 1000 మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉందని, ఈమేరకు సౌకర్యాలు కల్పించా లన్నారు. బారికేడ్లు, రన్నింగ్ ట్రాక్, షామి యానాలు, బందోబస్తు, విద్యుత్తు, తాగునీరు, సీసీ కెమెరాలు, భోజనాలు, మరుగు దొడ్లు తదితర అంశాలపై చర్చించారు.

# పరవాడ తహసిల్దార్ ను కలిసిన

## జడ్పిటిసి పి.ఎస్.రాజు



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ నూతన తహసిల్దార్ పి కనకారావుని పరవాడ మండల జడ్పిటిసి సభ్యులు మరియు జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సభ్యులు పిఎస్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ కార్య క్రమంలో మండల వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వర రావు, బూస అప్పలరాజు, వెన్నెల పాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు,పి.బోనం సర్పంచ్ బండారు కల్పనా రాజ్ శేఖరు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియపరచారు.. అనంతరం ఎంపీటీసీలు గొల్లవెల్లి శ్రీనివాసు, కలపాక ఎంపీటీసీ సభ్యులు సప్ప సన్యాసిరావు, పెదముసిడివాడ ఎంపిటిసి అభ్యర్థినందవరపు శ్రీనివాసు, ఈ బోనంగి మాజీ సర్పంచ్ బుగిడి గోవింద తదితరులు దుస్సాలవాతో ఘనంగా సన్మానించారు... ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# నష్ట పరిహారం పై స్పష్టత ఇచ్చి పనులు చేపట్టాలంటూ సింహాచలం బీ ఆర్ టి ఎస్ బాధితుల డిమాండ్

- అధికారులు ప్రజా ప్రతినిధులు తక్షణమే బాధితులకు న్యాయం చేయాలి :పాశర్ల
- తమ డిమాండ్లు పరిష్కరించకుండా పనులు చేపడితే తీవ్ర పరిణామాలు ఉంటాయి : సతివాడ శంకర్ రావు





సింహాచలం (విజయభాను న్యూస్) : సింహాచలం బీ ఆర్ టీ ఎస్ పనులు బాధితులకు నష్టపరిహారం పై స్పష్టత ఇవ్వకున్నా తమ డిమాండ్లు పరిష్కరించకుండా పనులు చేపడతుండటంతో బాధితులు తీవ్ర భయాందనలతో అధికారులు స్థానిక ఎమ్మెల్యే తమ గోడు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా టీడీపీ విశాఖ పార్లమెంటరీ నియో జక వర్గ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ మాట్లాడుతూ బాధితులు కు నష్ట పరిహారం పై స్పష్టత ఇవ్వకుండా వారి డిమాండ్లు పరిష్కరించకుండా పనులు ఏ విధంగా చేపడతారంటూ జీవీఎంసీ అధికారులు స్థానిక ఎమ్మెల్యే అవంతీ పై తీరుపై దుయ్య పట్టారు అధికారులు బాధితుల నష్ట పరిహారం డిమాండ్లు పరిష్కరించకుండా పనులు ఏ విధంగా చేపడ తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు ఈ ప్రాంతం నుండి మూడు సార్లు ఎన్నికయిన అవంతీ శ్రీనివాస్ బాధితులకు నాయ్యం చేయకుండా తప్పించుకు తిరుగుతున్నారని మిమ్మల్ని గెలిపించిన ప్రజలకు మీరు చేసే న్యాయం ఇదేనా అన్నారు.నిత్యం స్వామి దర్శనానికి వచ్చి పోయే మీకు బాధితులు పరిస్థితులు కనిపించట్లేద అన్నారు. ఇప్పటికీనా బాధితులకు నాలుగు టీడీఆర్ లు డబల్ రోడ్డు 150 గజాల స్థలం స్థానికంగా కేటాయించాయలని లక్షల ఎకరాలు పేదలకు ఇస్తున్నాం అంటూ చెప్పుకొనే మీరు విలువైన భూములు అభివృద్ధి కొరకు మీకు ఇస్తున్నందుకు వారికి స్థానికంగా 150గజాలు స్థలం ఇవ్వలని డిమాండ్ చేసారు ఈ విషయమై బుధవారం జీవీఎంసీ బాధితులతో కలిసి సమశ్య పరిష్కరించమని కోరుతామన్నారు టీడీపీ అధికార ప్రతినిధి సతివాడ శంకర్ రావుమాట్లాడుతూ అధికారులు చాలా నిర్లక్ష్యంగా దురుసుగా బాధితుల పట్ల ప్రవర్తిస్తున్నారని బాధితుల తరుపున మేము మాట్లాడితే మాపై ఏదోరకంగా కేసులు బనాయించే పరిస్థితి ఇక్కడ నడుస్తుందని బాధితుల తరుపున మేము కోరేది వారికి స్పష్ట మైన హామీ డిమాండ్ మేరకు 150గజాల స్థలం డబల్ రోడ్డు నాలుగు టీడీ ఆర్ లు స్థానికంగా స్థలం కేటాయించాలని అందుకు వ్యతిరేకంగా పనులు చేపడితే బాధితుల తరుపున ఎంతవర కైనా తెగిస్తామని తీవ్ర పరిణాములు ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు ఈ కార్య క్రమంలో టీడీపీ పాశర్ల సతివాడ శంకర్ రావు చీర కృష్ణ తమ్మయ్య డాక్టర్ రాజీవ్ తదితర బాధితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మెగా ఇంట సంబరాలు..

## తల్లిదండ్రులైన రామ్ చరణ్- ఉపాసన దంపతులు



మెగా ఇంట సంబరాలు మిన్నంటాయి. ప్రముఖ నటుడు రామ్‌చరణ్–ఉపాసన దంపతులు తల్లిదండ్రులయ్యారు. జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో ఉపాసన ఆడబిడ్డకు జన్మనిచ్చారు. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్టు అపోలో ఆసుపత్రి ప్రకటన విడుదల చేసింది. మెగా ఇంట సంబరాలు మిన్నంటాయి. ప్రముఖ నటుడు మెగాస్టార్ చిరంజీవి కుటుంబంలో మూడో తరం అడుగిడింది. రామ్ చరణ్ - ఉపాసన దంపతులు తల్లిదండ్రులయ్యారు. మంగళవారం తెల్లవారు జామున జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో ఉపాసన ఆడబిడ్డకు జన్మనిచ్చారు. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్టు అపోలో ఆసుపత్రి ప్రకటన విడుదల చేసింది. ఉపాసన ప్రసవం నేపథ్యంలో చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ, ఇతర కుటుంబసభ్యులు రాత్రి ఆసుపత్రికి వచ్చారు. వారసురాలి రాకతో వారంతా ఆనందంలో మునిగిపోయారు. అనంతరం చిరు కుటుంబసభ్యులు ఆసుపత్రి నుంచి తిరిగి ఇంటికి వెళ్లారు.

చరణ్- ఉపాసనలకు 2012లో వివాహమైన సంగతి తెలిసిందే. వీరిద్దరు తల్లిదండ్రులు కాబోతున్నట్టు గతేడాది డిసెంబరు 12న ఇరు కుటుంబాలు వెల్లడించాయి. కొన్ని రోజుల క్రితం ఉపాసన సీమంతం వేడుకను ఘనంగా నిర్వహించారు. చెర్రీ–ఉపాసనకు పాప పుట్టిన నేపథ్యంలో కొణిదెల, కామినేని కుటుంబసభ్యులు మరోసారి అపోలో ఆసుపత్రికి చేరుకోనున్నారు.

సాధారణంగా ఎవరైనా దంపతులు పిల్లలు పుట్టిన తర్వాత వేరు కాపురం పెడుతుంటారని, తాము దానికి పూర్తి భిన్నమని ఉపాసన ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ప్రస్తు తం తాను, చరణ్.. అత్తమామలతో కాకుండా విడిగా ఉంటున్నామని, బేబీ పుట్టిన తర్వాత అత్తమామల (చిరంజీవి- సురేఖ)తోనే ఉండాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. తమ ఎదుగుదలలో గ్రాండ్ పేరంట్స్ కీలక పాత్ర పోషించారని, గ్రాండ్ పేరంట్స్‌తో ఉంటే వచ్చే ఆనందాన్ని తమ బిడ్డకు దూరం చేయాలనుకోవడం లేదని చెప్పారు.


# తెలుగు సినిమా నాకు పుట్టినిల్లు లాంటిది : కాజల్




తెలుగు సినిమా నాకు పుట్టినిల్లు లాంటిదని స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పేర్కొన్నారు. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న కొత్త సినిమాకు "సత్యభామ" టైటిల్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రాన్ని ఆరమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. "మేజర్" చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్ ప్లే అందించారు. అఖిల్ దేగల దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం కాజల్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లో ఈ చిత్ర టైటిల్, ఫస్ట్ గ్లింప్స్ విడుదల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హీరోయిన్ కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ.. "తెలుగు సినిమా నాకు పుట్టినిల్లు లాంటిది. టాలీవుడ్ లో మళ్లీ నటిస్తుండటం ఆనందంగా ఉంది. శేఖర్ కమ్ముల గారి సినిమాల్లో హీరోయిన్స్ ను ఎంతో పవర్ ఫుల్ గా చూపిస్తారు. ఆయన సినిమాలను ఇష్టపడతాను. నా పుట్టిన రోజున మా టీమ్ ఫస్ట్ గ్లింప్స్ తో సర్ ప్రైజ్ చేయడం సంతోషంగా ఉంది. మీరు ఇచ్చే ప్రోత్సాహంతో ఎప్పటికీ గుర్తుండే ఒక మంచి సినిమాను అందిస్తాం. అన్నారు.నిర్మాత శ్రీనివాస రావు తక్కలపల్లి మాట్లాడుతూ.. "ఇవాళ మా సంస్థ ఆరమ్ ఆర్ట్స్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. ఆరమ్ అంటే బంగారం అని అర్థం. ఈ చిత్రంతో పాటు మా సంస్థలో రాబోయే చిత్రాలన్నీ బంగారంలా ఉంటాయి. "సత్యభామ" గ్లింప్స్ కు ఇప్పటికే మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ కార్యక్రమానికి అతిథిగా వచ్చిన శేఖర్ కమ్ముల గారికి థాంక్స్. అలాగే మా ఫస్ట్ ప్రాజెక్ట్ చేస్తున్న కాజల్‌కు థాంక్స్". అన్నారు. చిత్ర సమర్పకులు, స్క్రీన్ ప్లే అందించిన శశికిరణ్ తిక్క మాట్లాడుతూ.. "నేను శేఖర్ కమ్ముల గారి దగ్గర పనిచేశాను. సినిమాలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని శేఖర్ గారు చెబుతుండేవారు. నేనూ అదే ఫాలో అవుతున్నాను. ప్రొడక్షన్ సైడ్ వచ్చినప్పుడు ఫీమేల్ ఒరియెంటెడ్ సబ్జెక్ట్ చేయాలనుకున్నాను. కాజల్ ను అప్రోచ్ అయ్యా. ఆమె కథ విని ఎలా రియాక్ట్ అవుతారో అనుకున్నాం. కానీ ఆమె సంతోషంగా అంగీకరించింది. ఫిల్మ్ స్కూల్ లో గ్రాడ్యుయేట్ చేసిన అఖిల్ ను దర్శకుడిగా ఎంచుకున్నాం. తన వర్క్ మాకు అందరికీ బాగా నచ్చింది. ఈ సినిమా ఒక యూనిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని ఆశిస్తున్నాం." అన్నారు.దర్శకుడు అఖిల్ దేగల మాట్లాడుతూ.. "దర్శకుడు శేఖర్ గారికి అభిమానిని. ఆయన సినిమాలు చూసి స్ఫూర్తి పొందుతుంటాం. ఆరమ్ ఆర్ట్స్ సంస్థలో మొదటి సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం నాకు దక్కడం సంతోషంగా ఉంది. నా మొదటి సినిమా హీరో కాజల్ గారికి థాంక్స్. ఈ సినిమా జర్నీలో నాకు పూర్తి సపోర్ట్ ఇచ్చింది శశికిరణ్ గారు. స్టోరీ సెలెక్షన్ దగ్గర నుంచి షుటింగ్ వరకు ప్రతి విషయంలో సపోర్ట్ ఇచ్చారు. మంచి టీమ్ నాకు దొరికింది. వారి సహాయంతో మంచి సినిమా చేశానని అనుకుంటున్నా." అన్నారు.దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ – "లీడర్" సినిమాకు నా దగ్గర శశికిరణ్ పనిచేశాడు. తను దర్శకుడిగా మారి రెండు పెద్ద చిత్రాలను రూపొందించాడు. "మగధీర"లో మిత్రవిందగా కాజల్ ఎప్పటికీ మనకు గుర్తుంటుంది. ఇప్పుడూ అంతే అందంగా ఉంది. పెళ్లయినా నాయికలు తమ కెరీర్ కొనసాగించాలి అనేందుకు కాజల్ నిదర్శనం. "సత్యభామ" గ్లింప్స్ చూశాను. అందులో కాజల్ క్యారెక్టరైజేషన్, డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. టీమ్ అందరికీ ఆల్ ద బెస్ట్." అన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



# జూలై 21న "అన్నపూర్ణ ఫోటో స్టూడియో" విడుదల



టైటిల్, కాన్సెప్ట్ తో పాటు లిరికల్ పాటలతో ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచిన "అన్నపూర్ణ ఫోటో స్టూడియో" సినిమా జూలై 21న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా విడుదల తేదీని తాజాగా చిత్రబృందం ప్రకటించింది. చైతన్య రావ్, లావణ్య జంటగా నటించిన ఈ చిత్రంలో మిహిరా, ఉత్తర, వైవా రాఘవ, లలిత్ ఆదిత్య ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని బిగ్ బెన్ సినిమాస్ పతాకంపై యష్ రంగినేని నిర్మించారు. చెందు ముద్దు దర్శకత్వం వహించారు. ఈ సినిమా విడుదల తేదీ ఖరారైన సందర్భంగా నిర్మాత యష్ రంగినేని మాట్లాడుతూ.. "గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమ కథ ఇది. పీరియాడిక్ సినిమాగా ఆకట్టుకుంటుంది. దర్శకుడు చెందు ముద్దు ఈ చిత్రాన్ని ఆద్యంతం ఆసక్తికరంగా రూపొందించారు. 80 దశకం నేపథ్యంతో సినిమా సాగుతుంది.

మా సంస్థకు మంచి పేరు తెచ్చే చిత్రమవుతుంది. ఇప్పటికే సినిమా నుంచి విడుదల చేసిన కాన్సెప్ట్ పోస్టర్, లిరికల్ సాంగ్స్ కు మంచి స్పందన వస్తోంది. జూలై 21న మా సినిమాను విడుదల చేస్తాం."అన్నారు

ఈ చిత్రానికి సంగీతం - ప్రిన్స్ హెన్రీ, సినిమాటోగ్రఫీ - పంకజ్ తొట్టాడ, ఎడిటర్ - డి వెంకట్ ప్రభు, పీఆర్వో - జీఎస్కే మీడియా, బ్యానర్ -బిగ్ బెన్ సినిమాస్, నిర్మాత - యష్ రంగినేని, రచన దర్శకత్వం - చెందు ముద్దు.

# లవ్ యూ రామ్ ట్రైలర్ విడుదల




సక్సెస్ ఫుల్ డైరెక్టర్ కె దశరథ్ నిర్మాతగా వ్యవహరిస్తూ కథ అందించిన చిత్రం 'లవ్ యు రామ్'. ఈ చిత్రానికి డివై చౌదరి దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా టీజర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈరోజు ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. అపర్ణకు రోహిత్ తన ప్రేమను ప్రపోజ్ చేయడంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. అయితే రామ్ మాత్రం 'రాముడు మంచి బాలుడు' టైపు కాదు. అతను చాలా స్వార్థపరుడు, చాలా మంది అమ్మాయిల ఎమోషన్‌తో ఆడుకుంటాడు. అపర్ణతో ప్రేమ ప్రయాణంలో రామ్ మంచి వ్యక్తిగా మారతాడా? అనేది కథాంశం. ఈ మూవీకి సినిమాటోగ్రాఫర్ సాయి సంతోష్ , సంగీత దర్శకుడు కె వేద బ్రిలియంట్ . ఈ చిత్రానికి ఎస్‌బి ఉద్ధవ్ ఎడిటర్, గురు మురళీకష్ణ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. సుధాకర్ బొర్రా (టేనస్సీ) , డి నాగేశ్వర్ రావు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ గోపు, శివ మొక్క స్క్రీన్ ప్లే అందించారు. ప్రవీణ్ వర్మ డైలాగ్స్ రాశారు. ఈ మూవీ జూన్ 30న విడుదలౌతుంది.

# జులైలో 'బవాల్'




చిన్న, పెద్ద సినిమాలు తేడాలు లేకుండా కొన్ని సినిమాలు ఓటీటీలోకి నేరుగా వస్తున్నాయి. ఈ క్రమంలో ఓ ఆసక్తికర చిత్రం నేరుగా ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యేందుకు సిద్ధమైంది. నితేశ్ తివారీ దర్శకత్వంలో వరుణ్ ధావన్, జాన్వీకపూర్ జంటగా నటించిన మూవీ 'బవాల్'. షాజిద్ నదియాద్‌వాల్ నిర్మాత. థియేటర్‌లో విడుదల కావాల్సిన ఈ సినిమా ప్రముఖ ఓటీటీ వేదికగా అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ కానుంది. జులై నెలలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు అమెజాన్ ప్రైమ్ వీడియో తెలిపింది. 200 దేశాల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. 'ప్రతి ప్రేమ కథ ఒక యుద్ధమే' అని క్యాప్షన్‌లో పేర్కొన్నారు. ప్రేమ, యుద్ధం నేపథ్యంలో 'బవాల్' కథ సాగనున్నట్లు అర్థమవుతోంది.

# ఆ హీరోతో ఫొటో అడిగితే దారుణంగా అవమానించారు : బాలీవుడ్ నట





సినీతారలు వారి వ్యక్తిగత రక్షణ కోసం బాడీ గార్డ్‌లను నియమించుకుంటారు. అయితే ఒక్కోసారి వారు చేసే పనుల వల్ల ఆ సెలబ్రిటీలు వార్తల్లో నిలుస్తుంటారు. ఇటీవల సల్మాన్ ఖాన్ బాడీ గార్డ్స్ బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్‌ను తోసేసిన న్యూస్ నెట్టింట వైరలైన విషయం తెలిసిందే. దీనిపై విక్కీ వివరణ కూడా ఇచ్చాడు. తాజాగా మరో నటి సల్మాన్ భద్రత సిబ్బంది గురించి మాట్లాడిన మాటలు చర్చనీయాంశంగా మారాయి. 'దబాంగ్3'లో కీలకపాత్రలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది హేమ శర్మ ఆ సినిమా నిర్మాణ సమయంలో జరిగిన చేదు అను భవాన్ని తాజాగా ఈ నటి గుర్తుచేసుకుంది. "దబాంగ్3' లో అవకాశం వచ్చినప్పుడు చాలా సంతోషించాను. సినిమా షూటింగ్ అయిపోయాక సల్మాన్‌తో ఫొటో కోసం ఎంతో ప్రయత్నించాను. కానీ ఆయన బాడీ గార్డ్స్ నన్ను దారుణంగా అవమానించారు. కుక్కని తరిమినట్లు తరిమేశారు. ఆ సమయంలో సెట్‌లో కనీసం 100 మంది ఉన్నారు. వాళ్లం దరి ముందు నాతో అలా ప్రవర్తించే సరికి నాకు 10 రోజులు నిద్రపట్టలేదు. ఆయనతో ఫొటో కోసం నేను ఎంతోమందిని అడిగాను. బిగ్‌బాస్‌కు వచ్చినప్పుడు నా కోరిక చెప్పాను" అని హేమశర్మ తెలిపింది.

ప్రస్తుతం ఆమె చెప్పిన మాటలు బాలీవుడ్‌లో చర్చనీ యాంశంగా మారాయి. ఇక ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డుల కార్యక్రమంలో విక్కీ కౌశల్‌తో సల్మాన్ వ్యక్తిగత సిబ్బంది దురుసుగా ప్రవర్తించిన ఘటన నెట్టింట వైరలైంది. దీనిపై నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు.

# ధోనీ లెజెండ్‌గా ఎలా మారాడంటే..?

## ఆసక్తికర ఘటనను పంచుకున్న మాజీ క్రికెటర్



ఎంఎస్ ధోనీ.. క్రికెట్‌లో ఈ పేరే ఓ సంచలనం. టీమ్‌ఇండియాకు రెండోసారి వన్డే ప్రపంచకప్ అందించినా.. ఐపీఎల్‌లో తన జట్టును ఐదోసారి విజేతగా నిలబెట్టినా.. ఆ క్రెడిటంతా మహేంద్రుడికే దక్కుతుంది. ఇలా తనదైన వ్యూహాలతో ముందుకు సాగుతూ.. ఎంతో మంది యువ ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తాడు ఈ దిగ్గజం. అతడి గొప్పతనం గురించి తెలిపే ఎన్నో ఘటనలు ఉన్నాయి. వాటిలో ఓ ఆసక్తికరమైన విషయాన్ని మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రాపంచుకున్నాడు. తన ఆలోచనా విధానంతో ధోనీ ఓ లెజెండ్‌గా ఎలా మారాడో వివరించాడు. "2004లో టీమ్‌ఇండియా జింబాబ్వే, కెన్యా పర్యటనలో ఉంది. ఆ సమయంలో ధోనీ కంటే దినేశ్ కార్తిక్‌కు జట్టులో ఎక్కువ ప్రాధాన్యం ఉండేది. మహీ రిజర్వ్ కీపర్‌గా ఉండగా.. డీకే తుది జట్టులో ఉన్నాడు. ఓ సమయంలో నెట్స్‌లో డీకేకు ధోనీ బౌలింగ్ చేయడం చూశా. వెంటనే ధోనీ వద్దకు వెళ్లి 'ఎందుకు అతడికి బౌలింగ్ చేస్తున్నావు..? అతడు నీకు పోటీ కదా. అతడు బాగా ఆడితే.. నీకు అవకాశాలు రావు కదా. నువ్వు బ్యాటింగ్ లేదా కీపింగ్ ప్రాక్టీస్ చేయాలి. ఎందుకు బౌలింగ్ చేస్తున్నావు?' అని ప్రశ్నించాను. వెంటనే దానికి ధోనీ..'నన్ను ఆపొద్దు. నేను బౌలింగ్ చేయాలి. నువ్వు బ్యాటింగ్ చేస్తానంటే.. నీకూ బౌలింగ్ చేస్తా' అని బదులిచ్చాడు" అని చోప్రా ట్విటర్ వీడియోలో ఆనాటి ఘటనను గుర్తు చేసుకున్నాడు. 'ఆ తర్వాత ధోనీ ఆలోచనా విధానం.. ఇన్ని సంవత్సరాలుగా అతడిని ఓ విజయవంతమైన క్రికెటర్‌గా ఎలా మార్చిందో నాకర్థమైంది. అతడు ప్రపంచంలోనే గొప్ప క్రికెటర్‌గా ఎలా మారాడో తెలిసింది' అని చోప్రా అన్నాడు. "అప్పుడు ధోనీ చెప్పిన సమాధానంలోని అర్థం నాకు తెలిసింది.

# ఐర్లాండ్ పర్యటనకు బుమ్రా..!




టీమిండియా అభిమానులకు బీసీసీఐ గుడ్ న్యూస్ చెప్పబోతోంది. వెన్నుగాయం కారణంగా గతేడాది ఆగస్టు నుంచి అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న టీమిండియా క్రికెటర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి టీమ్‌తో చేర నున్నట్టు తెలుస్తోంది. వెస్టిండీస్ టూర్ తర్వాత భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌లో పాల్గొనేందుకు బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్సీఏ)లో ఫిట్నెస్ సెంటర్‌లో బుమ్రా సాధన చేస్తున్నాడు.బుమ్రా రాకపై బీసీసీఐ ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. 'బుమ్రా వెన్ను నొప్పి నుంచి పూర్తిగా కోలుకుని ఎన్సీఏలో ఫిట్నెస్ ను మెరుగుపరుచుకునే క్రమంలో ఉన్నాడు. అతడు త్వరలోనే ఐర్లాండ్ సిరీస్ ఆడేందుకు ఎదురుచూస్తున్నాడు. టీమిండియాకు ఇది బిగ్ బూస్ట్. అన్నీ కుదిరితే అతడు ఆసియా కప్ లో ఆడతాడు...'అని తెలిపాడు.

# అప్పన్నను దర్శించుకున్న విశాఖ శారదాపీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి



అనంతరము వేద పండితులచే వేద ఆశీర్వచనము శేష వస్త్రంతో సత్కరించి ఆలయ ఇఓ డి.భ్రమరాంబస్వామివారి ప్రసాదాలను అందజేశారు తదుపరి స్వామీజీ మాట్లాడుతూ చాతుర్మాస దీక్ష నిమిత్తం ఋషీకేష్ బయలుదేరుతూ అప్పన్నను దర్శించుకోవడం సంప్రదాయం అని తెలిపారు.

వీరితో ధర్మకర్తలు సభ్యులు దినేష్ రాజు సంపంగి శ్రీనివాస్ సువ్వాడ శ్రీదేవి సహాయ కార్య నిర్వహణా ధికారి లు రమణమూర్తి నరసింహారాజు పర్య వేక్షకులు పాలూరి నర్సింగరావు పి ఆర్ ఓ నాయుడు తదితరులు పాల్గొన్నారు



సింహాచలం, **(విజయభాను న్యూస్) :** సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి వారిని విశాఖ శారదాపీఠాధిపతులు శ్రీ స్వరూ పానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారు మంగళ వారం ఉదయం దర్శించు కున్నారు వీరికి ఆలయ కార్యనిర్వహ ణాధికారి డి.భ్రమరాంబ పూర్ణ కుంభ స్వాగతం పలికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్యులు వేద పండితులు వేదమంత్రాలతో నాదస్వ రాలతో బేడా ప్రదక్షణ స్వామి వారి దర్శనము

# కుట్రలో భాగంగానే పున్నయ్య స్వామిపై ఆరోపణలు

- గతంలో పున్నయ్య స్వామిని విజయసాయి రెడ్డి చంపేస్తామన్నారు
- ఆశ్రమానికి సంబంధించి భూ అక్రమణ కోసం నాలుగేళ్లుగా ప్రయత్నాలు
- ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతీ స్వామి



మద్దిలపాలెం ( విజయభాను న్యూస్): కొందరు నాయకులు కుట్రలతోనే జ్ఞానానంద ఆశ్రమం పున్నయ్య స్వామి పై లైంగిక దాడి ఆరోపణలు చేస్తున్నారు అని ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతీ స్వామి పేర్కొన్నారు. కొత్త వెంకోజీపాలెంలో ఉన్న రామానంద, జ్ఞానానంద ఆశ్రమానికి విచ్చేసి మీడియాతో మాట్లాడారు గతంలో కూడా ఇక్కడి భూములు ఆక్రమించడానికి ప్రయత్నాలు జరిగాయన్నారు. అందులో భాగంగానే వైసీపీ నేత విజయసాయి రెడ్డి స్వామిని చంపేస్తాను అని బెదిరించారని గుర్తు చేశారు. ఇక్కడి బాలిక అదృశ్యంపై పోలీసు ఫిర్యాదు చేశారు అన్నారు. ఇంతలో ఈ ఆరోపణలు వెనుక బలమైన కుట్ర వుంది అన్నారు. ప్రస్తుతం ఈ ఆశ్రమంలో ఉంటున్న స్వామీజీ కి సంబంధించి నడుస్తున్న వివాదం పైన కొందరు రాద్ధాంతం చేస్తున్నారు అని మండి పడ్డారు. అసలు ఏమి జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నారు అన్నారు. రూ.కోట్లు విలువ చేసే భూముల ఆక్రమణ కోసమే కొన్ని రాబందులు నాలుగేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇక్కడి స్వామి, పిల్లలు, సిబ్బంది నీ బెదిరించడం, ఆవులు తరలించడం చేస్తున్నారు అన్నారు. మేము ఆశ్రమం లో అడుగు పెట్టకుండా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గం అన్నారు. ఇదేమైనా పకిస్తానా అని అసహనం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో స్వామీజీలు, ఆర్.ఎస్.ఎస్.సంఘటన జాతీయ అధికార ప్రతినిధి తురగా శ్రీరామ్, బిజెపి నాయకులు రామచంద్రమూర్తి, ఫణీంద్ర, ఇతర హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కూడలి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

## జివియంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** సిరిపురం (ద్రోణం రాజు సర్కిల్) కూడలి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జివియంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మూడవ జోన్ పరిధిలోని ద్రోణం రాజు సర్కిల్, బీచ్ రోడ్ లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ద్రోణం రాజు కూడలి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, కూడలిలో వ్యర్థాలతో తయారుచేసిన విభిన్న ఆకృతులను ఆకర్షణయంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బీచ్ రోడ్ లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించి,



పనులు మందకొడుగా సాగుతున్నాయని త్వరతి గతిన పనులు చేపట్టి ఈనెల చివరినాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బీచ్ రోడ్డు కోస్టల్ బ్యాటరీ నుండి అప్పుఘర్ వరకు ప్రధాన కాలువలోని వ్యర్థాలను తీసి రోడ్డుపై ఉంచేస్తున్నారని, దీనివలన ఆ ప్రాంతం విపరీతమైన దుర్వాసన వెదజల్లుతుందని, తీసిన వ్యర్థాలను వెంటనే ఎత్తించాలని అధికారులను ఆదేశించారు. ఆర్కే బీచ్ నుండి ఫామ్ బీచ్ వరకు శాండ్ బీచ్ క్లీనింగ్ కార్యక్రమంలో నిర్వహించాలని జోనల్ కమిషనర్ ను ఆదేశించారు. బీచ్ లో వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని అవి ఎప్పటికప్పుడే తొలగించాలని ఆదేశించారు. బీచ్ లో ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ప్లాస్టిక్ ఇంకా కనిపిస్తుందని, ప్లాస్టిక్ నిర్మూలనకు ఆయా ప్రాంతాలలో నిగా ఉంచి చర్యలు చేపట్టాలని, బీచ్ రోడ్ లో రాత్రి పారిశుద్ధ్య పనులు పక్కాగా జరగాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జివియంసి పర్యవేక్ష ఇంజనీర్లు వినయ్ కుమార్, వేణుగోపాల్, జొనల్ కమిషనర్ విజయలక్ష్మి, కార్యనిర్వాహక ఇంజనీర్, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు తదితరులు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ




ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** ఆంధ్రవిశ్వవిద్యాలయం, రోటరీక్లబ్స్ ఆఫ్ విశాఖ పట్నం, ఏయూ యోగా కేంద్రం సంయుక్తంగా బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. ఏయూ సిల్వర్ జూబ్లీ మైదానంలో ఉదయం 6 గంటల నుంచి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, యోగా విభాగం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్, రోటరీ క్లబ్‌ల సభ్యుల తదితరులు పాల్గొన్నారు.

# ధోనీ లెజెండ్‌గా ఎలా మారాడు



న్యూఢిల్లీ : ఎంఎస్ ధోనీ క్రికెట్‌లో ఈ పేరే ఓ సంచలనం. టీమ్‌ఇండియా కు రెండోసారి వన్డే ప్రపంచకప్ అందించినా.. ఐపీఎల్‌లో తన జట్టును ఐదోసారి విజేతగా నిలబెట్టినా.. ఆ క్రెడిటంతా మహేంద్రుడికే దక్కుతుంది. ఇలా తనదైన వ్యూహాలతో ముందుకు సాగుతూ.. ఎంతో మంది యువ ఆటగాళ్లకు స్ఫూర్తిగా నిలుస్తాడు ఈ దిగ్గజం. అతడి గొప్పతనం గురించి తెలిపే ఎన్నో ఘటనలు ఉన్నాయి. వాటిలో ఓ ఆసక్తికరమైన విషయాన్ని మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా పంచుకున్నాడు. తన ఆలోచనా విధానంతో ధోనీ ఓ లెజెండ్‌గా ఎలా మారాడో వివరించాడు. “2004లో టీమ్‌ఇండియా జింబాబ్వే, కెన్యా పర్యటనలో ఉంది. ఆ సమయంలో ధోనీ కంటే దినేశ్ కార్తిక్‌కు జట్టులో ఎక్కువ ప్రాధాన్యం ఉండేది. మహీ రిజర్వ్ కీపర్‌గా ఉండగా.. డీకే తుది జట్టులో ఉన్నాడు. ఓ సమయంలో నెట్స్‌లో డీకేకు ధోనీ బౌలింగ్ చేయడం చూశా. వెంటనే ధోనీ వద్దకు వెళ్లి ‘ఎందుకు అతడికి బౌలింగ్ చేస్తున్నావు.. అతడు నీకు పోటీ కదా. అతడు బాగా ఆడితే.. నీకు అవకాశాలు రావు కదా. నువ్వు బ్యాటింగ్ లేదా కీపింగ్ ప్రాక్టీస్ చేయాలి. ఎందుకు బౌలింగ్ చేస్తున్నావు?’ అని ప్రశ్నించాను. వెంటనే దానికి ధోనీ..‘నన్ను ఆపొద్దు. నేను బౌలింగ్ చేయాలి. నువ్వు బ్యాటింగ్ చేస్తానంటే.. నీకూ బౌలింగ్ చేస్తా’ అని బదులిచ్చాడు” అని చోప్రా ట్విటర్ వీడియోలో ఆనాటి ఘటనను గుర్తు చేసుకున్నాడు.

‘ఆ తర్వాత ధోనీ ఆలోచనా విధానం.. ఇన్ని సంవత్సరాలుగా అతడిని ఓ విజయవంతమైన క్రికెటర్‌గా ఎలా మార్చిందో నాకర్థమైంది. అతడు ప్రపంచంలోనే గొప్ప క్రికెటర్‌గా ఎలా మారాడో తెలిసింది’ అని చోప్రా అన్నాడు. “అప్పుడు ధోనీ చెప్పిన సమాధానంలోని అర్థం నాకు తెలిసింది. కావాలనుకున్నదాన్ని అతడు ఎలా సాధించగలిగాడో నాకర్థమైంది. ధోనీ.. దినేశ్ కార్తిక్‌ను కానీ.. మరే ఇతర ఆటగాడిని కానీ పోటీగా అనుకోలేదు. అతడితోనే అతడు పోటీపడ్డాడు. అందుకే అంటుంటారు.. నీకు నువ్వే పోటీ.. ఎప్పుడూ బెస్ట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండాలి అని” అంటూ ఆనాటి ఘటనను వివరించాడు. ధోనీ.. తన గేమ్‌లో మాస్టర్. తన గొప్పతనాన్ని తిరిగి ఆవిష్కరించుకుంటూనే ఉంటాడు. అతడికి ఎవరైనా పోటీ ఉన్నారంటే.. అది అతడు మాత్రమే’ అంటూ మహేంద్రుడి గురించి ఆకాశ్ చోప్రా పేర్కొన్నాడు. ఇక ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో తిరిగి చెన్నై జట్టును ఛాంపియన్‌గా నిలిపాడు ధోనీ. ఐదోసారి ధోనీ సేన విజేతగా గెలిచి.. అత్యధిక సార్లు టైటిళ్లు గెలిచిన ముంబయి రికార్డును సమం చేసిన విషయం తెలిసిందే.

# ఆ పార్టీలపై చర్యలు తీసుకోండి..

## ఎన్నికల సంఘానికి ఏడీఆర్ లేఖ




దిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నేరచరిత్రకు సంబంధించిన విషయాలను వెల్లడించడంలో ఆయా రాజకీయ పార్టీలు విఫలమైనట్లు ఎన్నికల సంస్కరణల వేదిక అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పేర్కొంది. ఇలా విఫలమైన పార్టీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. ఈ విషయంపై సుప్రీంకోర్టు ఇప్పటికే రాజకీయ పార్టీలను మందలించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది. ‘2023లో త్రిపుర, మేఘాలయా, నాగాలాండ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎన్నికలు జరగగా.. 2022లో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపుర్, పంజాబ్ ఎన్నికలు జరిగాయి. అంతకుముందు 2021లో పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీలకు పోలింగ్ జరిగింది. వాటిలో పోటీచేసిన అభ్యర్థుల నేర చరిత్రను వెల్లడించడంలో విఫలమైన ఆయా పార్టీలపై కఠిన చర్యలు తీసుకోవాలి’ అని ఏడీఆర్ కోరింది. అటువంటివారి జాబితాను ఎన్నికల సంఘం తక్షణమే సుప్రీంకోర్టుకు తెలియజేయాలని కోరింది. వాటిపై చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలించాలని సూచించింది.

సుప్రీంకోర్టు ఆదేశాలు, తదనంతరం ఎన్నికల సంఘం విడుదల చేసిన నిబంధనల ప్రకారం, తమ అభ్యర్థులపై పెండింగులో ఉన్న కేసులతోపాటు నేర స్వభావం గురించి రాష్ట్ర, జాతీయ స్థాయిలోని రాజకీయ పార్టీలు తమ వెబ్‌సైట్లో పొందుపరచాలి. అంతేకాకుండా అటువంటి వారిని ఎందుకు ఎంపిక చేసుకున్నారు? అనే విషయాన్ని తెలియజేయడంతోపాటు నేరస్వభావం లేనివారిని ఎందుకు ఎంపిక చేసుకోలేదనే విషయాన్ని రాజకీయ పార్టీలు వెల్లడించాలి. ఈ క్రమంలోనే 2020లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల నేర చరిత్రను వెల్లడించకపోవడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అందుకుగాను కోర్టు ధిక్కరణ కింద పది రాజకీయ పార్టీలకు భారీ జరిమానా విధించిన విషయం తెలిసిందే.

# జగనన్న ఆణిముత్యాలకు పురస్కారం



విజయవాడ(విజయభాను న్యూస్) : జగనన్న ఆణిముత్యాల పేరుతో టెన్త్, ఇంటర్ రాష్ట్రస్థాయి టాపర్లకు అందిస్తున్న పురస్కారాన్ని సీఎం జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా అందుకుంటున్న శ్రీకాకుళం జిల్లా విద్యార్థినితో మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్, జిల్లా ఇన్చార్జి మంత్రి, శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ. జిల్లా నుంచి మొత్తం నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. పదవ తరగతిలో ఫస్ట్ ర్యాంకర్ కు లక్ష రూపాయలు, ద్వితీయ ర్యాంక్ రూ.75 వేలు, తృతీయ ర్యాంక్కు రూ.50 వేలు ప్రోత్సాహకం ప్రభుత్వం అందిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 88 మంది ఈ అవార్డులు అందుకున్నారు.

## అందువల్లే 30లక్షల ఉద్యోగ ఖాళీల్ని కేంద్రం భర్తీ చేయట్లేదు: ఖర్గే విమర్శలు

దిల్లీ: కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో భారీగా ఉన్న ఉద్యోగ ఖాళీలను( భర్తీ చేయడంలేదంటూ మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మండిపడ్డారు. 2014లో భాజపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీలు రెట్టింపై ఆ సంఖ్య 30లక్షలకు చేరుకుందన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు వ్యతిరేకమని.. అందువల్లే ఉద్యోగాలను భర్తీ చేయడంలేదని ఆరోపించారు. 2014 వరకు కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 11.57శాతం ఉద్యోగ ఖాళీలు ఉండగా.. 2022 నాటికి ఆ సంఖ్య 24.3శాతానికి పెరిగిందంటూ ఓ ఛార్ట్‌ను షేర్ చేశారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు మోదీ సర్కార్ ఎన్నడూ ప్రాధాన్యం ఇవ్వలేదని.. 2014తో పోలిస్తే కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగ ఖాళీలు రెట్టింపు అయ్యాయంటూ ఖర్గే ఆక్షేపించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 30లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్టు పేర్కొన్నారు. మోదీ సర్కార్ దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా బలహీనవర్గాలకు వ్యతిరేకమని.. అందుకే ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలేదని విరుచుకుపడ్డారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com